ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 27.0

రాసలీలల రాద్ధాంతం !

» విద్యా శాఖలో చర్చ.. సమగ్ర శిక్షలో కట్టు కథల దుష్ప్రచారం!

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగుల రాసలీలల వ్యవహారం ఉపాధ్యాయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఇదే అదనుగా సమగ్ర శిక్షలో మరొకరు సొంత కార్యాలయంలోని ఉద్యోగుల మధ్య ఇదే రకమైన చిచ్చు పెట్టేలా దుష్ప్రచారానికి ఒడిగట్టారు. ఈ పరిణామాలను ఈ రెండు కార్యాలయాల అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. ఉపాధ్యాయ వర్గాల మధ్య జరుగుతున్న ప్రచారం. జిల్లా విద్యా శాఖ కార్యాలయ పరిధిలో ఇద్దరి మధ్య కొంతకాలంగా నెలకొన్న రాసలీలలు ఇటీవల పెద్ద మనుషుల దృష్టికి రాగా ఇరువురికీ చీవాట్లు పెట్టి, ఇకపై అలా జరగకుండా ఒప్పందం కుదిర్చినట్లు తెలిసింది. అయినప్పటికీ ఈ వ్యవహారానికి ముగింపు పలకకుండా కొనసాగిస్తుండటంతో కొద్దిరోజుల క్రితం వారివురూ ఏకాంతంగా ఉన్నపుడు అకస్మాత్తుగా ఇంటి గదిలోకి చొరబడిన కుటుంబ సభ్యులు ఒకరు వీడియోను తీసినట్టు సమాచారం. ఊహించని ఈ పరిణామానికి ఉలిక్కిపడ్డ జంటపై కుటుంబ సభ్యులు దాడికి దిగటం, గాయాలతో ఆసుపత్రుల్లో చేరడంతో హాట్ టాపిక్‌గా మారింది.

సమగ్ర శిక్షలో కట్టుకథల దుష్ప్రచారం

విద్యాశాఖలో ఈ పరిణామాలు జరుగుతున్న నేపథ్యంలోనే సమగ్ర శిక్ష ప్రాజెక్టులో ఏళ్ల తరబడి పనిచేస్తున్న మరొకరు అక్కడి కార్యాలయంలో అలజడి సృష్టించేందుకు కొందరి మధ్య అవాంఛనీయ సంబంధాలు ఉన్నట్టు ప్రచారం ప్రారంభించినట్టు తెలుస్తోంది. తనను ప్రాజెక్టు నుంచి బయటకు పంపేయడానికి కారణమయ్యారన్న అక్కసుతోనే కృత్రిమ కథలు అల్లుతూ ప్రచారం చేయిస్తున్నారు. ఇలా చేయడం ద్వారా ప్రాజెక్టు కార్యకలాపాల్లో ఒకింత అశాంతిని సృష్టించి వ్యక్తిగతంగా పైశాచిక ఆనందాన్ని పొందడానికి ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఈ రెండు పరిణామాల ముగింపు ఎలా ఉంటుందోనన్న ప్రచారం ప్రస్తుతం ఉపాధ్యాయ వర్గాల్లో జరుగుతోంది.


వేగవరంలో జాతీయ రహదారిపై పెట్రోలు సీసాలతో రాస్తారోకో చేస్తున్న చిరువ్యాపారులు

మాకు ఆత్మహత్యలే శరణ్యం..

» వేగవరంలో రోడ్డు పక్కన దుకాణాలను తొలగించే యత్నం

» పెట్రోలు సీసాలతో చిరువ్యాపారుల ఆందోళన

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : తమకు న్యాయం చేయాలని లేదంటే పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడతామని మండలంలోని వేగవరంలో జాతీయ రహదారిపై చిరు వ్యాపారులు పెట్రోల్ సీసాలతో గురువారం రాస్తారోకో నిర్వహించారు. వేగవరంలోని రహదారి ఇరువైపులా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్న వారిని ఖాళీ చేయించేందుకు రెవెన్యూ గురువారం అధికారులు ఎక్స్‌కవేటర్లతో రావడంతో చిరువ్యాపారులు ఆందోళనకు దిగారు. గత నలభై ఏళ్లుగా రోడ్డు పక్కనే చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమపై ఇలా కక్ష సాధింపులు చేయడం సరికాదని తమపై దయ చూపాలని వారు కోరారు. కొంత మంది నాయకులు తమను ఖాళీ చేయించాలని చూస్తున్నారని బాధితులు వాపోయారు. తామంతా తమ దుకాణాలను తొలగించవద్దంటూ కలెక్టరును కలిసి విన్నవించుకున్నామని, చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దని గతంలోనే అధికారులకు చెప్పారని తెలిపారు. కాగా చిరు వ్యాపారులు పెట్రోల్ సీసాలతో ఆందోళన చేయడంతో రెవెన్యూ అధికారులు దుకాణాలను తొలగించకుండా వెనుదిరగడంతో ఆందోళన విరమించారు.

సాంఘిక సంక్షేమశాఖ జేడీ జయప్రకాశ్ బదిలీ

ఏలూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లా సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ వి.జయప్రకాశ్ బదిలీ అయ్యారు. ఆయనను అమరావతి సచివాలయం కార్యాలయం జేడీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను గురువారం జారీ చేసింది. రెండేళ్ల క్రితం జయప్రకాశ్ ఏలూరు జిల్లా జాయింట్ డైరెక్టర్‌గా విధుల్లో చేరారు.

స్నేహితుడి పుట్టినరోజుని భద్రాచలం వెళుతూ..

» లారీని ఢీకొట్టిన కారు
» బీటెక్ విద్యార్థి మృతి
» నలుగురికి గాయాలు
» ఇద్దరి పరిస్థితి విషమం



■ లోపలి పేజీలో..



■ లోపలి పేజీలో..

మా జిల్లాకు నిధులు ఇవ్వండి

» జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే బొలిశెట్టి డిమాండ్

» ఏజెన్సీలో తాగునీటి సమస్య పరిష్కరించాలి : ఎమ్మెల్యే బాలరాజు

ఏలూరు జడ్పీ హాల్‌లో గురువారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఇన్‌చార్జి కలెక్టర్ ధాత్రిరెడ్డి



• తీరిన రోడ్డు కష్టాలు..

మద్వానిగూడెం - కోరుకొల్లు ప్రధాన రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. గతంలో ఈ రోడ్డంతా గుంతలు పడి అధ్వానంగా ఉండటంతో ద్విచక్ర వాహన చోదకులు పలువురు గుంతల్లో పడి క్షతగాత్రులయ్యారు. వాహనాలు గోతుల్లో దిగబడి ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు అవస్థలు పడేవారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చొరవతో రూ.కోటి 20 లక్షలతో ఈ రహదారికి మరమ్మతులు చేపట్టి పూర్తి చేశారు. దీంతో ఆర్టీసీ బస్సులు యథావిధిగా రాకపోకలు సాగిస్తు న్నాయి. గుంతల రోడ్డు నుంచి మోక్షం కలగడంతో వాహనదారులు ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

\- కలిదిండి

మైనింగ్‌కు.. మహర్దశ!


చింతలపూడి ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలు (ఫైల్)

» మంత్రివర్గ నిర్ణయాలతో క్వారీ రంగానికి ఊతం

» గ్రావెల్‌కు ఐదేళ్లు, క్వారీ, ఖనిజాలకు పదేళ్ల గడువుతో లీజులు

» ఆదాయం పెంచేందుకు అధికారులు కార్యాచరణ

(ఏలూరు- ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో కుదేలైన మైనింగ్ రంగాన్ని తిరిగి గాడిన పెట్టే చర్యలకు తెలుగు దేశం ప్రభుత్వం పూనుకోవడంతో జిల్లాలో మైనింగ్‌కు మహర్దశ పట్టనుంది. జిల్లాలో ద్వారకాతిరుమలలో బాల్ క్లే, కొయ్యలగూడెం, చింతలపూడి, చాట్రాయి మండలాల్లో రోడ్డు మెటల్, భీమడోలు, ఉంగుటూరు, టి.నర్సాపురం, చాట్రాయి, ముసునూరుల్లో గ్రావెల్ క్వారీలు ఉన్నాయి. ఓవరాల్‌గా 18 క్వారీలున్నట్లు అధికారులు చెబుతున్నారు. గతంలోని లీజు గడువు పెంపు, పాత దరఖాస్తులకు మోక్షం కలిగించడం.. భారం లేకుండా లీజుల పునరుద్ధరణ, కన్సిడరేషన్ భారం తొలగించడం వంటి మార్పులకు మంగళవారం మంత్రి వర్గం భేటీలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

గతంలో అంతా దోపిడీయే

గత తెలుగుదేశం ప్రభుత్వంలో రోడ్డు మెటల్ పదేళ్లకు, గ్రావెల్ ఖనిజాలను ఐదేళ్లకు లీజులకు ఇచ్చే వారు. అనంతరం పునరుద్ధరణ జరిగేది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీజులు భారీగా పెంచారు. వార్షిక డెడ్‌రెంట్ విలువకు పదిరెట్లు చెల్లించాల్సి వచ్చింది. దీంతో చాలామంది అనుమతి తీసు కోకుండా ఇష్టానుసారంగా దోపిడీ చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని జేబుల్లో వేసుకున్నారు. ప్రస్తుత నిర్ణయంతో గ్రావెల్‌కు ఐదేళ్లు, ఇతర ఖనిజాలకు పదేళ్లకు రెన్యువల్ చేస్తారు. సీనరేజ్ ధరకు సమానంగా కొవిడ్ కాలంలో వసూలు చేసి కన్సిడరేషన్ మొత్తం నుంచి విముక్తి కలిగించారు. దీంతో జిల్లాలోని లీజుదారులకు ప్రయోజనం చేకూరనుంది. కొత్తవారు ఈ రంగంలోకి అడుగుపెట్టేందుకు మార్గం సుగమం కానుంది. క్వారీలు మూతపడి పనిలేక కార్మికులు పస్తులుండేవారు. భారాలు భరించలేక యజమానులు లబోదిబోమన్నారు.

తాజాగా గట్టెక్కించే దిశగా..

ఏపీ సూక్ష్మ ఖనిజాల విధానం-2025ను మంత్రివర్గం ఆమోదించించడంతో కొన్నేళ్లుగా ఇబ్బందుల్లో ఉన్న పరిశ్రమలను గట్టెక్కించే దిశగా సానుకూల నిర్ణయాలతో గనుల ఆధారిత కుటుంబాలకు మంచి రోజులు రానున్నాయి. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి ఉత్తర్వులు రావాల్సి ఉందని జిల్లా అధికారులు చెబుతున్నారు. ఉత్తర్వులు వచ్చాకా ఆ మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. మరోవైపు తాము కూడా ఆదాయం పెంచడానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్టు పేర్కొంటున్నారు.

వైసీపీ హయాంలో దరఖాస్తులు పెండింగ్

2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముందు దరఖాస్తు చేసుకున్న వారికి ముందస్తు ప్రాతిపదికన గనులు లీజుకు ఇచ్చేవారు. దరఖాస్తు ఫీజు నామమాత్రంగానే ఉండేది. వైసీపీ ప్రభుత్వంలో 2022లో ఈ-వేలం విధానం అమల్లోకి తీసుకురావడంతో దాదాపుగా చాలా దరఖాస్తులు పెండింగ్‌లో పడిపోయాయి. పాత వాటి బూజులు దులిపి వాటిని కార్యాచరణలో పెట్టనున్నారు. అక్రమార్కులు, వైసీపీ నేతలు అనుచరులే గనులను కొల్లగొట్టారు. వీటికి చెక్ పెట్టేందుకు జిల్లా అధికారులకు జీవోలు రూపంలో ఉత్తర్వులు రానున్నాయి.

33 నెలలుగా జీతాల్లేవ్!

ఎర్రకాలువ జలాశయం (ఎన్ఎంఆర్) ఉద్యోగుల ఆవేదన

ముప్పైమూడువేల ఎకరాల ఆయకట్టు, నాలుగు వేల నాలుగు వందల టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టు, 53 కిలోమీటర్ల కుడి, ఎడమ ప్రధాన కాల్వలు, మూడు మండలాల పరిధిలోని పది వేల ఎకరాల ఆయకట్టు ఉన్న 290 ఎకరాల మైనర్ ఇరిగేషన్ చెరువులు.. వీటన్నింటినీ మెయింటైన్ చేయడానికి ఎంత మంది సిబ్బంది ఉన్నారో తెలుసా.. కేవలం ఆరుగురు నామినల్ మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్) సిబ్బంది మాత్రమే అంటే నమ్ముతారా.. ఇంత పెద్ద ప్రాజెక్టులో రేయింబవళ్లు కష్టపడుతున్న ఆ ఆరుగురికి కనీసం ప్రతీ నెలా ఇచ్చే జీతం వస్తుందా.. అంటే అదీ లేదు. 33 నెలలుగా జీతాలు లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. కుటుంబాలను పోషించేందుకు అప్పుల పాలై రోడ్డున పడుతున్నారు.


ఎర్రకాలువ జలాశయం గేట్లకు మరమ్మతులు చేస్తున్న ఎన్ఎంఆర్ ఉద్యోగులు (ఫైల్)

» రూ.45 లక్షల జీతం బకాయిలు

» వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధులు నిలిపివేత

» మరోవైపు వేధిస్తున్న సిబ్బంది కొరత

» ఉండాల్సింది 25 మంది.. ఉన్నది ఆరుగురే

» సమస్యలను పట్టించుకునే నాథుడే కరువు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెంలో శ్రీ కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం పరిధిలో పని చేయడానికి 2015లో అప్పటి ప్రభుత్వం వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.సత్యనారాయణను రూ.18 వేల జీతానికి, హెడ్ మజ్దూర్‌లుగా ఎస్.వీరేంద్ర, టి.అశోక్, డి.గాంధీలను రూ.16 వేల జీతానికి, వాచ్‌మెన్‌లుగా ఎస్.శేఖర్ బాబు,పి.లక్ష్మణ్‌లను రూ.15 వేల జీతానికి ఎన్ఎంఆర్‌లుగా విధుల్లోకి తీసుకుంది. గత పదేళ్లుగా వీరు అదే జీతానికి తమ ఉద్యోగ బాధ్య తలు నిర్వహిస్తున్నారు. ఎర్రకాలువ ప్రాజెక్టు హెడ్ ఆఫ్ అకౌంట్ ద్వారా ఏటా ప్రాజెక్టు నిర్వహ ణకు రూ.15 లక్షల వరకు నిధులు వచ్చేవి. ఆ నిధులతో ప్రాజెక్టు నిర్వహణ చేస్తూనే ఎన్ఎంఆర్ సిబ్బంది ఆరు గురికి జీతాలు సక్రమంగానే ఇచ్చేవారు. 2022 ఆగస్టు నుంచి అప్పటి వైసీపీ ప్రభు త్వం నిధులను నిలిపివేసింది. దీంతో దాదాపు 33 నెలల నుంచి ప్రాజెక్టు నిర్వహణకు నిధులూ లేవు, సిబ్బందికీ జీతాలు లేవు.

ఆరుగురిపైనే భారం..

ఎర్రకాలువ ప్రాజెక్టు పరిధిలో 25 మంది సిబ్బంది పలు బాధ్యతలు నిర్వహించాల్సి ఉండగా వారందరి బాధ్యతలు ఈ ఆరుగురే నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఒక డీఈ, ఒక ఏఈ ఉండాల్సి ఉండగా ఇటీవల ఇక్కడ పనిచేసిన డీఈ రాంబాబు పదోన్నతిపై వెళ్లారు. ప్రస్తుతం ఏఈ మాత్రమే ఇక్కడ ఉన్నారు. కొయ్యలగూడెం డీఈ రవీంద్ర ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్నారు.

ఈ ఇద్దరి ఇంజనీర్ల పరిధిలో డ్యామ్ సైట్ 25 మంది రెగ్యులర్ సిబ్బంది ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. ఎన్ఎంఆర్‌లుగా చేరిన ఆరుగురే అన్ని పనులు చేస్తూ ప్రాజెక్టును ఎప్పటికప్పుడు కాపాడుతున్నారు. ప్రాజెక్టు పనితో పాటు ఎస్టి మేట్లు తయారు చేయడం వంటి కార్యాలయ పనులను వీరే చేస్తున్నారు. వరదల సమయంలో రాత్రింబవళ్ళు ప్రాణాలకు తెగించి ప్రాజెక్టు వద్ద పని చేస్తా మని, ఎన్నో సార్లు విష సర్పాల బారి నుంచి త్రుటిలో తప్పించుకున్నామని వారు పేర్కొంటు న్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి జీతం బకాయిలు ఇప్పించాలని, ప్రతీ నెల జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుటుంబ పోషణకు అప్పులు ..



గత 33 నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. పిల్లల్ని చదివించుకోవడానికి, కుటుంబాన్ని పోషించుకోవడానికి అప్పులు చేస్తున్నాం. వడ్డీలు చెల్లించకపోవడం వల్ల అప్పులు ఇచ్చిన వారు కార్యాలయానికి వచ్చి గొడవ చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజా దర్బార్‌లో మంత్రి లోకేశ్‌ను, పోలవరం ప్రాజెక్టు వద్ద ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి పత్రాలు ఇచ్చాం. దాదాపు రూ.45 లక్షల వరకు మా జీతాలు రావాల్సి ఉంది..

\- మల్లాది సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్


అటవీభూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్ తదితరులు

రమణక్కపేటలో జాయింట్ సర్వేకు చర్యలు

ముసునూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేటలోని రెవెన్యూ, ఫారెస్ట్ భూముల విస్తీర్ణం తేల్చేందుకు త్వరలో జాయింట్ సర్వే చేపట్టనున్నట్టు తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ తెలిపారు. నూజి వీడు అటవీశాఖ డిప్యూటీ రేంజర్ అరుణ కుమారితో కలిసి ఆయన గురువారం అటవీ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ భూములకు సంబంధించిన రికార్డులు, మ్యాప్‌ను పరిశీలించి, ప్రస్తుతం ఉన్న సరిహద్దు రాళ్లను చూశారు. కొంతకాలంగా ఈ అటవీభూములను జాయింట్ సర్వే చేసి, రెవెన్యూ, ఫారెస్ట్ భూములను విడగొట్టాలని పేద సాగుదారులు, లిబరేషన్ నాయకులు సంయుక్తంగా ఆందోళనలు చేయడంతోపాటు జిల్లా ఉన్నతాధికారులకు అర్జీలు ఇస్తూనే ఉన్నారు. అయినప్పటికి అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఎట్టకేలకు రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాలతో అధికారులు ఈ భూములను పరిశీలించారు. త్వరలోనే ఇరుశాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రవికాంత్, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.



కుర్చీలు ఖాళీ..!

» ప్రభుత్వ శాఖలను వేధిస్తున్న ఉద్యోగుల కొరత

» రెవెన్యూ, సర్వే, పరిశ్రమ, సంక్షేమ శాఖల్లో అధికం.. ప్రజలకు సేవల్లో జాప్యం

» ఉన్న సిబ్బందిపై పనిభారం

(ఏలూరు- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కీలకమైన ప్రభుత్వశాఖల్లో సిబ్బంది ఖాళీల కొరత వేధిస్తోంది. జిల్లాల విభజనతో సగం సిబ్బందిపైనే పొరుగు జిల్లాకు వెళ్లిపోవడంతో, ఆ పోస్టులు భర్తీ కాకపోవడం, ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో ఖాళీలు సంఖ్య పెరిగిపోతోంది. జిల్లా పరిపాలన విభాగానికి గుండెకాయ లాంటి రెవెన్యూశాఖల్లో తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్‌లోని పలు విభాగాల్లో ఖాళీలతో అధికారులకు పని ఒత్తిడి తప్పడం లేదు. సీనియర్ స్థాయిల్లో అధికారులు వివిధ సెక్షన్ల బాధ్యతలు చూడడం వల్ల సకాలంలో రాష్ట్ర అధికార యంత్రాంగానికి నివేదికలు, ఇతర సమాచారం, గణాంకాలు పంపగలుగుతున్నారు. కీలకమైన 10 మండలాల్లో తహసీల్దార్ల పోస్టులు ఖాళీగా ఉండగా, ఐదుచోట్ల డిప్యూటీ తహసీల్దార్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పలుచోట్ల సీనియర్, అసిస్టెంట్ల పోస్టులు 25 వరకు ఖాళీగా ఉన్నాయి. జిల్లా పరిశ్రమల కేంద్రంలో అసిస్టెంట్ డైరెక్టర్, జీఎం పోస్టులతో పాటు ఇండస్ట్రియల్ ప్రమోషనల్ అధికారుల కొరత తీవ్రంగా ఉంది. ఐదు ఇండస్ట్రియల్ ప్రమోషనల్ అధికారుల పోస్టులకు గాను ఇద్దరే ఉండడంతో 27 మండలాల్లో వారిద్దరే క్షేత్రస్థాయిలో యూనిట్ల స్థాపనకు, జిల్లా మీటింగ్‌లు వెళ్లాల్సి వస్తోంది. జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు కార్యాలయం పరిధిలో మండల స్థాయి సర్వేయర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. 27 మండల సర్వేయర్లు ఉండాల్సి ఉండగా, కేవలం 15 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 12 మండలాలు ఖాళీగా ఉన్నాయి. ఇదే కార్యాలయం జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంటు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సంక్షేమ శాఖల్లోనూ తీవ్ర కొరత

ప్రధానంగా వివిధ వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందజేసే సంక్షేమశాఖల్లోనూ సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. తెలుగుదేశం ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఈ సారి పెద్దఎత్తున లబ్ధి చేకూర్చనున్నారు. కిందస్థాయి సిబ్బంది లేకపోతే జిల్లా స్థాయి అధికారులకు నివేదికలు తయారు చేయించడం కష్టతరమే. ఇటీవల సీఎం నూజివీడు పర్యటనలోనూ సిబ్బందికి పరుగులు పెట్టాల్సి వచ్చింది. నివేదికలు, బ్యానర్లు, ఇతర ఏర్పాట్లలో ఇబ్బందులు తప్పలేదు. ప్రధానంగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కార్యాలయంలో ఏఈవో -2, ఈవో-1, సీనియర్ అసిస్టెంట్-4 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేవలం ఈడీతో పాటు రెగ్యులర్ పోస్టు (సీనియర్ అసిస్టెంట్), వాచ్‌మెన్ ఒకరు పనిచేస్తున్నారు.. ఆప్కాస్ నుంచి ఒక్కరు, ఎన్ఎంఆర్‌లు కింద ఇద్దరు పనిచేస్తున్నారు. డైరక్టరేట్ సోషల్ వెల్ఫేర్ కార్యాలయం నుంచి ఒక్క పోస్టు కింద డీసీఎంయూను ఇటీవల నియమించారు. ఈయన షాపుల అద్దెలు వసూళ్లకు ఉపయోగిస్తున్నారు. రెగ్యులర్‌గా విధులకు ఆటంకం తప్పడం లేదు. బీసీ సంక్షేమాధికారి కార్యాలయం లోనూ బీసీ కార్పొరేషన్‌లో ఇద్దరు జూనియర్ అసిస్టెంట్, ఒక సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో ఒక సూపరిటెండెంట్, ఒక జూనియర్ అసిస్టెంట్ మాత్రమే విధుల్లో ఉన్నారు. ఒక అటెండరును డిప్యూటేషన్ రప్పించుకున్నారు. ఇద్దరు సీనియర్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, టైపిస్ట్ పోస్టుల్లేకపోవడంతో ఉన్నవారితో విధులను అష్టకష్టాలు పడుతూ చేయించుకుంటున్నారు. రోజూవారీ విధులకు చాలా ఇబ్బందులు పడుతున్నట్టు జిల్లాస్థాయి అధికారులు మొరపెట్టుకున్నారు. ఈ శాఖల డైరక్టరేట్‌ల నుంచైనా నైపుణ్యం కలిగిన సిబ్బందిని పంపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తాళికట్టు శుభవేళ

ఈనెల 30న మంచి ముహూర్తం
రానున్న మూడు నెలల్లో 19 ముహూర్తాలు
జూన్ 10 నుంచి రెండు నెలలు పెళ్లిళ్లకు బ్రేక్

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి):విశ్వావసు నామ సంవత్సరం.. చైత్రమాస శుభవేళ..జిల్లాలో పలు జంటలు మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యే శుభ తరుణం ఆసన్నమైంది. చైత్రం నుంచి జ్యేష్టమాసం వరకూ మూడు నెలల్లో 19 మంచి ముహూర్తాలున్నాయని పండితులు చెబుతున్నారు. ఈ నెల 18, 20, 23, 30వ తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయంటున్నారు. 30వ తేదీ బుధవారం అక్షయ తృతీయ రావడంతో వేల సంఖ్యలో పెళ్లిళ్ల జరగనున్నాయి. ఆ రోజు చినవెంకన్న క్షేత్రంలో పలు కల్యాణ మండపాలు బుక్ అయ్యాయని దేవస్థానం, ప్రైవేటు మండ పాల యాజమాన్యాలు చెబుతున్నాయి. జూన్ 10 నుంచి జూలై 8 వరకూ గురుమౌఢ్యమి కారణంగా, జూన్ 27 నుంచి ఆషాఢమాసం ప్రారంభం కావడంతో ఆ నెల రోజులు ముహార్తాలు లేవని పండితులు చెబుతున్నారు. దీంతో ఈ ముహార్తాలకే వివాహాలు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. మౌఢ్యమి నెల రోజులు, ఆషాడమాసంలో మరో నెలరోజులు బ్రేక్ ఇచ్చిన తర్వాత తిరిగి శ్రావణంలో జూలై 26 నుంచి వివాహాలు ప్రారంభమవుతాయని పురోహితుడు గోవిందవరుల వెంకటరమణమూర్తి శర్మ చెప్పారు. వైశాఖ మాసంలో మే 1, 7, 8, 9, 11, 17, 18, 28 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయని ఆయన వివరించారు. జ్యేష్టమాసం వచ్చే జూన్ 3, 4, 5, 6, 7, 8 తేదీల్లో పెళ్లిళ్ల జరగనున్నాయి.



ఊపందుకుంటున్న పెళ్లి పనులు

ముహార్తాలకు తగ్గట్టే పెళ్లిళ్ల వందల సంఖ్యలో జరగనుండటంతో జిల్లాలో చాలా వరకు కల్యాణ మండపాలు బుక్ అయ్యాయి. ద్వారకా తిరుమల శ్రీవారి క్షేత్రంలో గదులు, సత్రాలు, కాటేజీలు, కల్యాణ మండపాలు రిజర్వు చేసుకున్నారు. కేటరింగ్, పచ్చిపూల మండపాలు, అలంకరణ, లైటింగ్, బాజాభజంత్రీలు, ట్రావెల్స్ పురోహితులకు మంచి డిమాండ్ కనిపిస్తుంది. పెళ్లి బృందాలవారు తమ ఏర్పాట్లలో బిజీబిజీగా ఉన్నారు. వివాహ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి పచ్చిపూల మండపాలు. వీటి ధరలు వింటే గుండె గుభేలుమంటోంది. రూ.50 వేల నుంచి రూ.4 లక్షలకుపైగా పలుకుతున్నాయి. ధనికులు తగ్గేదేలే అంటూ పెళ్లిళ్లకు ఏర్పాట్లు చేస్తుంటే పేద, మధ్య తరగతి వారు హడావుడి లేకుండా బంధు మిత్రుల సమక్షంలో ఆలయ ఆవరణలోనే జరిపిస్తున్నారు.



మంచి ముహూర్తాలున్నాయి

అన్ని నక్షత్రాల వారికి ఈనెల 18, 23, 30న మంచి ముహూర్తాలు ఉన్నాయి. 30న మరింత మంచి ముహూర్తం. ఎందుకంటే అక్షయ తృతీయ కలిసింది. దాదాపు 19 మంచి ముహూర్తాలు రానున్న మూడు నెలల్లో ఉన్నాయి. జూన్ 10 నుంచి మౌఢ్యమి, ఆ తరువాత ఆషాడం కావడంతో దాదాపు రెండు నెలలపాటు పెళ్లిళ్లకు బ్రేక్ పడనుంది.

- గోవిందవఝుల వెంకట రమణమూర్తి శర్మ, ద్వారకాతిరుమల





ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

చిన వెంకన్న హుండీ ఆదాయం రూ.1.93 కోట్లు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీవారికి హుండీల లెక్కింపు ద్వారా 20 రోజుల కాలానికి రూ.1.93 కోట్ల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో ఎస్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. ప్రమోద కల్యాణ మండపం ఆవరణలో గురువారం భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. హుండీల ద్వారా రూ.1,93,36,657 కోట్ల నగదు, భక్తులు సమర్పించిన 326 గ్రాముల బంగారం, 4.149 కేజీల వెండి లభించింది. రద్దయిన పాత నోట్లు రూ.500 పది, వెయ్యి నోట్లు ఐదు, రెండు వేల నోట్లు ఐదుతో పాటు విదేశీ కరెన్సీ లభించింది.



అలరించిన నాటక ప్రదర్శనలు

నటుడు, దర్శకుడు ఎన్.రవీంద్రరెడ్డికి ఎస్వీ రంగారావు స్మారక పురస్కారం

భీమవరం అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కళారంజని నాటక అకాడమీ ఆధ్వర్యంలో భీమవరం సోమేశ్వర,జనార్ధనస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న జాతీయస్థాయి తెలుగు నాటిక పోటీల రెండోరోజు గురువారం రాత్రి రెండు నాటికలు ప్రదర్శించారు. ముందుగా గుంటూరుకి చెందిన నటుడు, దర్శకుడు ఎన్.రవీంద్రరెడ్డికి ఎస్వీ రంగారావు స్మారక పురస్కారం అందించారు. ప్రపంచ దేశాలు భారతీయ వివాహ వ్యవస్థను పొగుడుతుంటే మన వాళ్ల భారతీయ సంస్కృతిని పక్కన పెట్టి డేటింగులు, చాటింగులు, క్లబులు-పబ్బులు అంటూ సహజీవనాలు అంటూ భ్రష్టుపట్టిపోతున్న నేటి వ్యవస్థలో కొడుకుని కాపాడుకోవడానికి ఒక తండ్రి పడిన ఆరాటం 'ఒక ఇల్లాలు చేసిన పోరాటం' నాటిక అందరినీ ఆలోచింప జేసింది. హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ఏలూరు వారి 'సారీ... రాంగ్ నంబర్' నాటక కళా ప్రియులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం గుంటూరు అభినయ ఆర్ట్స్ 'ఇది అతని సంతకం' నాటిక ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నాటక పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు జవ్వాది దశరధి శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు నల్లం వెంకట కృష్ణ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మెంటే పూర్ణ చంద్రరావు, మల్లుల సీతారామప్రసాద్, తదితర ప్రముఖులు ప్రేక్షకులు పాల్గొన్నారు.

ప్రపంచ కవితోత్సవానికి బాలచందర్‌కు ఆహ్వానం



పెనుగొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కవితోత్సవానికి ఆహ్వానం అందినట్లు ప్రముఖ కవి,రచయిత డాక్టర్ బాల చందర్ సాదే తెలిపారు. సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవాసంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏలూరు మహాలక్ష్మీ గోపాలస్వామి కల్యాణ మండపంలో మే 10,11 తేదీల్లో జరుగు ప్రపంచ కవితోత్సవాలకు ఆహ్వానం అందినట్లు ఆయన తెలిపారు.



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో దాసిరాజు

గుడ్ ఫ్రైడేకు తీరం వద్ద ఏర్పాట్లు చేయాలి : ఆర్డీవో దాసిరాజు

మొగల్తూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడే సందర్భంగా కేపీ పాలెం సాగర తీరంలో ఉన్న వేళాంకిణి మాత ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమయ్యే మౌలిక వసతులు కల్పించాలని నరసాపురం ఆర్డీవో దాసిరాజు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గురువారం తీరంలో గుడ్‌ఫ్రైడేకి క్రైస్తవులు ఉపవాస దీక్ష మాలలు విరమించనున్నందున వారికి వేళాంకిణి మాత ఆలయం వద్ద కల్పించాల్సిన ఏర్పాట్లుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా క్రైస్తవ విశ్వాసులు ఈ ఆలయానికి రావడం ఆనవాయితీ కావడంతో ఏర్పాట్లుపై జిల్లా అధికారుల ఆదేశాలతో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ శ్రీవేద, ట్రైనీ డీఎస్పీ మానస, తహసీల్దార్ రాజ్‌కిషోర్, ఎంపీడీవో త్రిశూలపాణి, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతి గృహాన్ని సందర్శించిన న్యాయాధికారి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత ఉం డడం వల్ల ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆరో గ్యాన్ని పొందవచ్చునని జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ అన్నారు. ఏలూరు పత్తేబాదలో ఉన్న నిరాశ్రయుల వసతి గృహాన్ని సందర్శించి అక్కడ ఉన్న వృద్ధులతో ఆయన మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న వైద్యసదుపాయాలు, ఆహార నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను పొందడంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరి ష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం దోమల బెడద ఎక్కువగా ఉందని చెప్పగా వాటి నివారణకు చర్యలు తీసుకోవాలంటూ ఆ సంస్థ నిర్వాహకులను రత్నప్రసాద్ ఆదేశించారు.



వృద్ధులతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్

మత్తులో చిత్తు



వ్యసనాలకు యువత బానిస

యువత పక్కదారి పడుతోంది.. బెట్టింగ్‌లు, గంజాయి, అల్లర్లు, కొట్లాటలతో పచ్చగా కళకళలాడే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నేడు నేర సామ్రాజ్యానికి అడ్డాగా మారుతోంది. ముఖ్యంగా గంజాయి మత్తులో యువత నేరాలకు పాల్పడుతోంది..గంజాయి, మద్యం మత్తులో సొమ్ముల కోసం దొంగతనాలు, హత్యలు, అత్యాచారాలకు ఒడిగడుతున్నారు. మరికొంత మంది క్రికెట్టు బెట్టింగులు, ఆన్‌లైన్ జూదాల పేరిట సొమ్ములు పోగొట్టుకుంటున్నారు.. ఆ సొమ్ములు రాబట్టుకోవడానికి అప్పులు చేసి వాటిని తీర్చుకోవడానికి చేయరాని తప్పులు, హత్యలు, నేరాలు చేసి జైలు పాలవుతున్నారు.

గంజాయి, బెట్టింగ్‌లకు అలవాటు
సొమ్ముల కోసం నేరాలు
విద్యార్థులు, నిరుద్యోగులను టార్గెట్ చేస్తున్న ముఠాలు

పోలవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి)

జరుగుతున్న నేరాలలో ఎక్కువ శాతం మైనర్లు, కళాశాల విద్యార్థులు, నిరుద్యోగులే ఉంటున్నారు. విద్యార్థుల జీవితాల్లోకి చాపకింద నీరులా పాకుతున్న గంజాయి, మద్యం, బెట్టింగ్ వంటి వ్యసనాలు విద్యార్థుల బంగారు భవిష్యత్తును నాశనం చేస్తున్నాయి. విద్యార్థులు సిగరెట్టు మద్యం అలవాట్లను యువత ఫ్యాషన్‌గా పీలవుతున్నారు. అక్కడితో ఆకకుండా గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. గంజాయి, మద్యం అక్రమ రవాణా చేసి సొమ్ములు చేసుకునే స్మగ్లర్లు వీరిని వినియోగించు కుంటున్నారు పోలీసులకు దొరికిన సందర్భంలో చల్లగా జారుకుంటున్నారు. ఇటీవల మన్యం ప్రాంతాల్లో డ్రోన్లతో గంజాయి సాగు, రవాణా చేసేంతగా అభివృద్ధి చెందింది.

విద్యార్థులే టార్గెట్..

ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ఏలూరు రేంజ్ మీదుగా అక్రమ రవాణా జరుగుతున్న గంజాయి రాష్ట్రంలో పలు ప్రధాన పట్టణాలలో ఇంజనీరింగ్, జూనియర్ కళాశాలల విద్యార్థుల భవిష్యత్తుని నాశనం చేస్తున్నది. ఏలూరు, దెందులూరు, కొయ్యలగూడెం, పోలవరం ఇతర పట్టణాలు, పల్లెలకు సైతం గంజాయి వినియోగం పాకిపోయింది.విశాఖ బోర్డరు నుంచి జగ్గంపేట, రాజమహేంద్రవరం, జొన్నాడ బ్రిడ్జి, ఏలూరు, విజయవాడ హైదరాబాదు వరకు కళాశాల విద్యార్థులనే టార్గెట్‌గా చేసుకుని గంజాయి రవాణా, అమ్మకాలు చేస్తున్నారు. జిల్లాలో సరస్వతీ నిలయాలుగా ఉండాల్సిన విద్యాలయాలు గంజాయి వినియోగానికి వేదికలుగా మారుతున్నాయి. 2022 ఏప్రిల్‌లో జిల్లాలోని ఒక వర్సిటీ హాస్టల్ విద్యార్థిపై గంజాయి వినియోగిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ఆ కళాశాల నుంచి విద్యార్థిని డిస్మిస్ చేశారు.ఏలూరు జిల్లాలో తెలికిచర్ల, ప్రకాశరావుపాలెం జీడిమామిడి తోటల్లో విద్యార్థులు గంజాయి పీల్చుతుండగా వారి తల్లిదండ్రులు పట్టుకుని కళాశాల మాన్పించిన సంఘటనలు ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం, బొమ్మూరు, ధవళేశ్వరం, కడియం, కొవ్వూరు, దేవరపల్లి, నల్లజర్ల, ఉండ్రాజవరం, గోపాలపురం, పోలవరం, అనంతపల్లి, తణుకు, తాడేపల్లిగూడెం, కొయ్యలగూడెం ప్రాంతాల్లో ఇటీవల భారీగా గంజాయి కేసులు నమోదయ్యాయి. పాపికొండల ప్రాంతం అడ్డాగా ఏర్పాటు చేసుకున్న కొన్ని కుటుంబాలు గంజాయి రవాణా చేస్తున్నాయి, ఆ ప్రాంతానికి చెందిన వ్యక్తి వద్దకు డ్రైవరుగా వెళ్లిన పాతపోలవరం గ్రామానికి చెందిన యువకుడు రెండేళ్ల క్రితం చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో వాహనంలో వున్న సరుకేంటో కూడా తెలియకుండా వెళ్లి ఆ రాష్ట్ర పోలీసులకు చిక్కి ఇప్పటివరకూ బెయిల్ కూడా రాక జైలులోనే మగ్గుతున్నాడు. గంజాయి స్మగ్లరు మాత్రం తీరిగ్గా తప్పుకున్నాడు. కొందరు గంజాయి స్మగ్లర్లు కళాశాల విద్యార్థులకు గంజాయి విక్రయించి వారిచేతే ప్యాకెట్ రూ.50 నుంచి రూ.500 వరకూ అమ్మేలా లాభం చూపించి నేరస్థులుగా మారుస్తున్నారు. కళాశాల విద్యార్థులు, నిరుద్యోగులను స్మగ్లర్లు టార్గెట్ చేసి విలాసాలు, బెట్టింగులు, మద్యం, జూదాలకు బానిసలుగా చేస్తున్నారు. వారిని ఇతర రాష్ట్రాలకు, రాష్ట్రంలో ప్రధాన నగరాలకు గంజాయి రవాణా చేయడానికి వినియోగిస్తున్నారు. ఈ విధంగా రవాణా చేస్తూ పట్టుబడ్డ యవత నేటికీ బెయిలు రాక జైళ్లలో మగ్గుతున్నారు.

నాలుగేళ్లలో 879 కేసులు

ఇటీవల జిల్లాలో గంజాయి పట్టుబడ్డ కేసులు పరిశీలిస్తే గంజాయి వినియోగం ఎంతగా ఉందో తెలుస్తుంది. 2022 జూలై 24న ఏలూరు త్రీటౌన్ పోలీసులు పెదపాడులో కారులో తరలిస్తున్న 550 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో రాజస్థాన్‌కి చెందిన రోహితాస్ మీనా అనే వ్యక్తిని అరెస్టు చేశారు. ఇటీవల జీలుగుమిల్లి మండలం తాటియాకుల గూడెం చెక్‌పోస్టు వద్ద రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల నుంచి మహారాష్ట్ర ఔరంగాబాదుకి 11 గోనెసంచుల్లో 110 ప్యాకెట్లలో తరలి స్తున్న 220 కిలోల గంజాయి పట్టుబడింది.ఈ కేసులో ఉల్లిపాయల లోడుతో వస్తున్న డ్రైవరు, క్లీనరు స్మగ్లర్లు ఇస్తామన్న 50 వేలకు కక్కుర్తిపడి పోలీసుల సోదాల్లో అడ్డంగా బుక్కయ్యారు. 2019 నుంచి 2023 వరకూ నాలుగేళ్లలో 879 కేసులు నమోదు చేశారు. 33.89 కోట్ల రూపాయల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని ధ్వంసం చేయడమే గాక 611 వాహనా లను పోలీసులు సీజ్ చేశారు. దెందులూరులో ఒక రియల్ ఎస్టేట్ ఖాళీ సైట్‌లో నర్సీపట్నం ఏజన్సీ నుంచి తెచ్చి అమ్మకాలు చేస్తున్న గంజాయిని 2024 నవంబరు 10 తేదీన ఏలూరు పోలీసులు స్వాధీనం చేసు కున్నారు. ఆ గంజాయి విలువ లక్షా యాభై వేల రూపాయలు.



గంజాయి మత్తులో నేరాలు

గంజాయి మత్తులో జరుగుతున్న అఘాయిత్యాలు అనేకం .. పోలవరం మండల కేంద్రంలో గతేడాది ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గంజాయి సేవిస్తున్న బాలుడిని పట్టుకున్న పోలీసులు జువైనల్ హోంకి తరలించారు. ఆ బాలుడితో పాటు కొంత మంది బాలురు మూలలంక డంపింగ్ ప్రాంతాల్లో గంజాయి సేవించి ఆ మత్తులో అక్కడే గడ్డి మేస్తున్న పశువులతో లైంగిక వాంఛ తీర్చుకుంటున్న నేపథ్యంలో గమనించిన స్థానికులు దేహశుద్ధి చేశారు. ఇటీవల మరో యువకుడు గంజాయి మత్తులో జన్మనిచ్చిన తల్లిపై అత్యాచారానికి పాల్పడగా అరుపులు విన్న స్థానికులు దేహశుద్ధి చేసి వదిలేశారు. కేసుపెట్టి అల్లరి చేస్తే మానవ సంబంధాల విలువలు పోతాయని ఆ విషయాన్ని స్థానికులు ఆ ప్రాంత పెద్దలు సర్దుబాటు చేశారు. వెనుకబడిన కాలనీకి చెందిన యువకుడు గంజాయి మత్తులో తండ్రిని తీవ్రంగా గాయపరచడంతో కోమాలోకి పోయి చావు బతుకులతో కొట్లాడి బతికి బయట పడ్డాడు.. కేసు పెడితే కొడుకు భవిష్యత్తు పోతుందని కేసు పెట్టకుండా వదిలేశాడు. పోలవరం మండలంలో పోలవరం, పట్టిసీమ, గూటాల మహాలక్ష్మీదేవిపేట, కొత్తపట్టిసీమ ప్రాంతాల్లో యువకులు గంజాయికి బానిసలై తమ భవిష్యత్తుని పాడు చేసుకుంటున్నారు.

విద్యార్థులపై పర్యవేక్షణ ఉండాలి

హైస్కూలు, కళాశాల విద్యార్థులు, దూరంగా హాస్టళ్ళలో ఉండి చదువుకుంటున్నవారు, రూమ్ అద్దెకు తీసుకుని చదవుకుంటున్న తమ బిడ్డల నడవడిక, అలవాట్లు, స్నేహాల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. చదువు, అవసరాల కోసం మనం ఇస్తున్న సొమ్ములు ఏవిధంగా వినియోగిస్తున్నారో చెక్ చేసుకోవాలి. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమ్స్, గంజాయి, సిగరెట్ వంటి అలవాట్లకు దగ్గర కాకుండా వారి దృష్టిని కెరీర్‌పై కేంద్రీకరించేలా తల్లిదండ్రులు మంచి గైడెన్స్ ఇవ్వాలి. దుర్వ్యసనాలకు బానిస అయితే కారణాలు తెలుసుకుని పోలీసులు, మానసిక వైద్యులతో కౌన్సెలింగ్ ఇప్పించడం, డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్‌ల ద్వారా వారిని సాధారణ స్థితికి తీసుకురావచ్చు.

రాత్రయితే రెచ్చిపోతారు..

ఆ రోడ్డులో వెళ్లాలంటే బిక్కు..బిక్కు
కన్నెత్తి చూడని పోలీసులు

భీమవరం క్రైం (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణానికి సరిహద్దులో ఉండే కొవ్వాడ పుంత ప్రాంతంలో కొంతమంది యువత రాత్రయితే మద్యం తాగి రెచ్చిపోతున్నారు. ఇటు పట్టణానికి, అటు పంచాయతీకి మధ్యలో ఉండే ఈ ప్రాంతాన్ని పోలీసులు రాత్రిపూట కన్నెత్తయినా చూడకపోవడంతో ఆ ప్రాంతంలోని కొంతమంది యువత ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రాత్రయితే చాలు రోడ్డుపైనే మద్యం తాగి, సీసాలు బద్దలుగొట్టి అటు వెళ్లే ప్రయాణికులు, మహిళలను సైతం అల్లరి చేస్తున్నారు. కొవ్వాడ పంచాయతీ పరిధిలో ఉండటంతో పంచాయతీ అధికారులు కూడా పట్టించుకోకపోవడం దారుణం. ఇటీవల కాలంలో ఆ ప్రాంతంలో భారీగా ఇళ్ల నిర్మాణాలు జరగడంతో జనం రద్దీ పెరిగింది. వాహనాలు కూడా రాకపోకలు రాత్రి వేళల్లో సాగిస్తున్నారు. అయితే ఈ అల్లరి మూక వల్ల ఇబ్బందులు పడుతున్నామని, పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎటువంటి దాడులు చేస్తారోనన్న భయంతో ఫిర్యాదు చేయడం లేదని కొందరు చెబుతున్నారు. భీమవరం రూరల్ పోలీసులు అసలు అటువైపు గస్తీ లేకుండా పట్టించుకోవడం లేదంటూ కొందరు ఆందోళన చెందుతున్నారు. దీంతో చోరీలు పెరిగాయని, వాహనాలు కూడా దొంగిలించుకుపోతున్నారని చెబుతున్నారు. పోలీసు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, ఆకతాయిల ఆటకట్టించాలని కోరుతున్నారు.



అల్లరిమూక ప్రజలను ఇబ్బంది పెడుతున్న కొవ్వాడ పుంతలోని ఒక ప్రదేశం

ఓ అమ్మకు కష్టం.. ఆదుకోరూ !

అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వృద్ధురాలు
చూసే దిక్కులేక ఒంటరిగా ఇంట్లో బందీ

పోలవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) :భర్త అకాల మరణంతో ఒంట్లో సత్తువ ఉన్నంత కాలం కూలిపనులు చేసి ఉన్న ఒక్క కూతురిని పెంచి పెళ్లి చేసి పంపింది. వృద్ధాప్యం మీదపడి ఆలనా పాలనా చూసే దిక్కులేక అనారోగ్యం పాలైంది. కాలు చేయి స్వాధీనం కోల్పోయి జీవచ్ఛవంలా తన ఇంట్లో బందీగా మారింది. నెలనెలా వస్తున్న నాలుగు వేల పెన్షన్ మందులకు, ఆహారానికి చాలక చీకటి గదిలో భారంగా బతుకు వెళ్లదీస్తున్నది. పోలవరం మండలం పట్టిసీమ గ్రామానికి చెందిన చిన్నం లక్ష్మికి ఒకే ఒక కూతురు.. పెళ్ళి చేసి పంపిన తర్వాత భర్త దూరమవడంతో ఉపాధిలేక ముగ్గురు పిల్లలతో పట్టిసీమ నుంచి పోలవరం వెళ్లి అక్కడే కూలిపని చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నది. అనారోగ్యంతో ఉన్న తల్లిని తమతో ఉంచుకుందామంటే ఇంటి యజమానులు అంగీకరించకపోవడం వల్ల తల్లిని చూసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఉదయం సాయంత్రం ఆమె మనవడో మనవరాలో టిఫిన్, భోజనం తీసుకుని వెళ్లి ఇస్తున్నారు. వారే ఆమెకు స్నానం చేయించి శుభ్రం చేసి ఇంట్లో ఉంచి తాళం వేసి వెళతారు. సరైన వైద్య సదుపాయాలు అందిస్తే ఆమె ఆరోగ్య పరిస్థితి కొంతమేర మెరుగవుతుందని ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని కేరళ లేదా మధురై వైద్య సేవలకోసం వెళ్లవలసి ఉంటుందని ఆమెను పరీక్షించిన స్థానిక ప్రభుత్వ వైద్యుడు తెలిపారు. అధికారులు స్పందించి పెన్షన్ పెంచేలా చర్యలు తీసుకోవాలని వృద్ధురాలి కూతురు కోరుతోంది. దాతలు సహకరించి ఆదుకోవాలని వేడుకుంటోంది. సాయమందించే దాతలు 94414 29853 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.





దండంగి గ్రామం వద్ద మట్టి నమూనాలు సేకరిస్తున్న మట్టి రాతి నాణ్యతా నిపుణుల బృందం

రెండో రోజు మట్టి నమూనాల సేకరణ

పోలవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో వినియోగించనున్న మట్టి నాణ్యతను కేంద్ర మట్టి రాతి నాణ్యతా పరిశీలన బృందం (సీఎస్ఎంఆర్ఎస్) రెండో రోజు గురువారం పరిశీలించింది. ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన గ్యాప్ 1, గ్యాప్ 2, ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం ప్రాంతాల్లో వినియోగానికి అవసరమయ్యే మట్టి నమూనాలను ప్రాజెక్టు స్పిల్ వే, పవర్ హౌస్, అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా దండంగిలో పంట పొలాల వద్ద బృందం నిపుణులు బి.సిద్దార్ధ్ హెడావో, విపుల్‌కుమార్ గుప్తా సేకరించారు. వీటిని ప్రాజెక్టులో ప్రాథమిక పరీక్షల అనంతరం, కొన్నింటిని ఢిల్లీ తీసుకుని వెళనున్నారు. అక్కడ ల్యాబ్‌ల్లో పరీక్షల అనంతరం నివేదికను కేంద్రానికి అందిస్తారు. ఈ బృందం శుక్రవారం మధ్యాహ్నం రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు వెళ్లి అక్కడి నుంచి ఢిల్లీ వెళ్లనున్నారు. జలవనరుల శాఖ డీఈ వి.నిర్మల, ఈఈ డి.శ్రీనివాసులు, మేఘా ఇంజనీరింగ్ ప్రతినిధులు ఉన్నారు.

24 నుంచి బదిలీ టీచర్లకు మెడికల్ క్యాంపు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సాధారణ బదిలీల్లో మెడికల్ సర్టిఫికెట్ ద్వారా ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్లు పొందేందుకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అర్హతలు వున్న టీచర్లు ఈ నెల 24 నుంచి 26 వరకు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిర్వహించే మెడికల్ చెకప్ క్యాంప్ నుంచి ధ్రువీకరణ పత్రాలను పొందాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. అనారోగ్య సంబంధిత సర్టిఫికెట్లను వైద్య నిపుణుల బృందానికి చూపించి కొత్తగా మెడికల్ సర్టిఫికెట్‌ను పొందాలి. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జడ్పీ, మండల పరిషత్, మున్సిపాల్టీలు, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మెడికల్ చెకప్ చేయించుకుని సంబంధిత డాక్టర్ నుంచి మెడికల్ సర్టిఫికెట్ తీసుకున్న తర్వాత మాత్రమే ప్రిఫరెన్షియల్ కేటగిరీలో సమర్పించాలి.ఈ క్యాంపు ఏలూరులో జరుగుతుంది' అని వివరించారు.

క్రమశిక్షణా చర్యలకు ఆదేశం

భీమవరం టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) భీమవరం మునిసిపాల్టీలో ఖాళీ స్థలానికి పన్నులు విధించడంలో నిబంధనలు పాటించని నలుగురు అధికారులపై చర్యలు తీసుకోవాలని పురపాలక ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు.ఈ మేరకు 17వ తేదీన జీవో నెంబరు 318 జారీ చేశారు ఈ సంఘటనపై ప్రభుత్వమే నేరుగా విచారణ చేసింది. వీరు క్షేత్రస్థాయిలో సరైన విచారణ లేకుండా పత్రాలను పరిశీలించకుండా పన్ను విధించినట్లు తేలిందని జీవోలో పేర్కొన్నారు. ఇందులో అప్పట్లో కమిషనర్‌గా పనిచేసిన ఎస్.శివరామకృష్ణ, అప్పటి రెవెన్యూ అఫీసర్ డి.సోమశేఖర్, అప్పటి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.కృష్ణమోహన్, వార్డు వెల్ఫేర్, అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ పి.చంద్ర శేఖర్‌లపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభు త్వమే నేరుగా కామన్ విచారణను చేస్తోందని, అవసరమైన నిబంధనల మేరకు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ పెర్కొన్నారు.

మా జిల్లాకు నిధులు ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పద్మశ్రీ

- జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే బొలిశెట్టి డిమాండ్
- వైసీపీ హయాంలో కేటాయింపులు నిల్
- మండలానికి కోటి ఇచ్చారన్న వైసీపీ సభ్యులు
- తమకు రాలేదన్న టీడీపీ సభ్యులు.. వాడీ వేడి చర్చ
- తాగునీటి తలెత్తకుండా చర్యలు : జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ
- ప్రణాళికాబద్ధంగా పంటల సాగు జరగాలి : ఎమ్మెల్యే ఆరిమిల్లి
- ఏజెన్సీలో తాగునీటి సమస్య పరిష్కరించాలి : ఎమ్మెల్యే బాలరాజు



ఏలూరు సిటీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. గురువారం మధ్యాహ్నం ఏలూరు జడ్పీ హాల్‌లో చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన ప్రారంభమైంది. సమావేశంలో విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జడ్పీ నిధుల కేటాయింపులో తమ జిల్లా నిర్లక్ష్యానికి గురైందని, ఇప్పటికైనా ఎక్కువ శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇది చర్చకు దారి తీసింది. గత ప్రభుత్వ హయాంలో పాలకొల్లు, యలమంచిలి మండలాలకు ఎక్కువ శాతం నిధులు కేటాయించారని పలువురు జడ్పీటీసీ సభ్యులు పేర్కొన్నారు. వైసీపీ జడ్పీటీసీ పి.విజయబాబు మాట్లాడుతూ గతంలో మండలానికి కోటి రూపాయల నిధులు జడ్పీ నుంచి కేటాయించారని అనడంతో వీరవాసరం జడ్పీటీసీ సభ్యుడు జి.ప్రకాశ్‌నాయుడు తమ మండలానికి ఒక్క రూపాయి కూడా రాలేదని, కోటి ఎక్కడ ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆచంట జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు కూడా తమ మండలానికి కోటి ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఈసారి తమ నియోజకవర్గానికి జడ్పీ నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి కోరడంతో కేటాయిస్తామని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ హామీ ఇచ్చారు.అనంతరం వివిధ శాఖల నివేదికలను ఆయా విభాగాల అధికారులు సభకు వివరించారు. దీనిపై సభ్యులు చర్చించారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు : జడ్పీ చైర్‌పర్సన్

ఎమ్మెల్యేలు బొలిశెట్టి, చిర్రి బాలరాజు, పలువురు జడ్పీటీసీలు తమ ప్రాంతాల్లోని కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ స్పందిస్తూ 'జిల్లాలో కృష్ణా, గోదావరి కాలువలు కట్టేసే తేదీని ఈ నెల 22 వరకు పొడిగించినందున, ఈలోగా తాగునీటి వనరులను పూర్తిస్థాయిలో నింపుకోవాలి. శివారు ప్రాంతాలకు నీరందేలా చర్యలు తీసుకోవాలి. వేసవిలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్య తలెత్తకూడదు. అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా బోర్లు వేయాలి. మరమ్మ తులకు గురైన బోర్లను వెంటనే పునరుద్ధరించాలి' అని అధికారులకు సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో జడ్పీటీసీలు, ఎంపీపీలకు అధికారులు ప్రోటోకాల్ సరిగా పాటించడం లేదని పలువురు సభ్యులు చెప్పడంతో చైర్‌పర్సన్ స్పందించారు. ప్రోటోకాల్ ఉల్లంఘిస్తే అధికా రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేయాలి : ఆరిమిల్లి

'జూలైలో కురిసిన అధిక వర్షాల వల్ల పంటలు కోల్పోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇంకా చెల్లించలేదు. వెంటనే జమయ్యేలా చూడాలి. అధిక దిగుబడిని అందించే టీఆర్ 126 ధాన్యం రకం సాగుపై రైతులకు అవగాహన కలిగించాలి. ఆ ధాన్యాన్ని ఆరబెట్టే డ్రయ్యర్లు కలిగిన మిల్లులకు నేరుగా అందించేలా చర్యలు తీసుకోవాలి. ఈ వ్యవసాయ సీజన్‌లో పది లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. తగిన విధంగా ధాన్యం సేకరణ లక్ష్యాలను నిర్ణయించాలి. సంక్రాంతి ముందుగా రబీ, జూలై నెలాఖరులోపు ఖరీఫ్ పంటలు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా వెళ్లాలి. దీనివల్ల రైతులు ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోకుండా ఉంటారు' అని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సూచించారు.

నిధులు సమానంగా కేటాయించాలి : ఎమ్మెల్యే బొలిశెట్టి

మూడు జిల్లాల పరిధిలో వున్న జిల్లా పరిషత్ నిధులు అన్ని నియోజకవర్గాలకు సమానంగా కేటాయించాలి.గతంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రతి నియోజక వర్గానికి రూ.25 కోట్లు కేటాయిస్తే.. తాడేపల్లి గూడెంకు రూ.7 కోట్లు మాత్రమే ఇచ్చారు. భవిష్యత్‌లో వ్యత్యాసాలు లేకుండా సమానంగా కేటాయించాలి. తాడేపల్లిగూడెంలో తాగునీటి సమస్య, సాగునీటి కాలువలు, చెరువులు, డ్రెయిన్లలో తూడు తొలగింపు పనులు చేపట్టాలి' అని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు.

తాగునీటి సమస్య తీర్చాలి : బాలరాజు

'గత ప్రభుత్వ హయాంలో పోలవరం ఏజెన్సీ ఏడు మండలాల్లో వున్న 121 గ్రామాలకు నిధులు కేటాయించకపోవడం వల్ల అన్ని గ్రామాలు వెనుకబడ్డాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధి వేగవంతంగా జరిగి ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఆనందంతో ఉన్నారు. రక్షిత మంచినీటి పథకాల పనులు పూర్తి చేసి గిరిజన ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలి' అని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కోరారు.

సమన్వయంతో పనిచేయాలి

స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పేర్కొన్నారు. గురువారం జడ్పీ సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకు స్థాయీ సంఘ సమావేశాల్లో పలు అంశాలపై సమీక్షించారు. అధికారులు మండలాల వారీగా మంజూరైన, ప్రగతిలో వున్న పనుల వివరాలను వివరించారు. పద్మశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు దశల వారీగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారన్నారు. జిల్లాలో మంజూరైన కొన్ని పనులు పూర్తి చేయని కారణంగా పెండింగ్‌లో ఉన్నా యని, వాటిని నిర్ధేశించిన సమయంలో పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. జడ్పీ సమావేశాలకు తూర్పు గోదావరి జిల్లా నుంచి అధికారులు హాజరు కాకపోవడంతో వారిపై చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో భీమేశ్వర్‌ను చైర్‌పర్సన్ ఆదేశించారు.

గౌరవ వేతనాలు ఇవ్వాలి : ఎమ్మెల్సీ వంక

'జడ్పీటీసీలు, ఎంపిటీసీలకు 18 నెలలుగా రావాల్సిన గౌరవ వేతనం బకాయిలు అందించేందుకు చర్యలు తీసుకోవాలి. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా మంజూరైన యూనిట్లకు లబ్ధిదారులతో వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. తణుకు సమీపంలో పశువుల మాంసం కేంద్రం కారణంగా పర్యావరణానికి విఘాతం కలుగుతోందని, ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలి' అని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ కోరారు. సమావేశంలో ఏలూరు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జడ్పీ సీఈవో కె.భీమేశ్వర్, పశ్చిమ, తూర్పుగోదావరి జేసీలు టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎస్.చిన్నరాముడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆ..కుర్చీ ఎవరిదో ?

- పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పదవిపై ఉత్కంఠ
- ఉమ్మడి పశ్చిమ గోదావరి నుంచి పోటీ పడుతున్న కూటమి పార్టీల సీనియర్ నేతలు



జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయం

పెంటపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు కూటమి పార్టీల నుంచి పోటీ మొదలైంది. జిల్లాలు విడిపోయినప్పటికీ ఈ సంస్థ మాత్రం ఉమ్మడి జిల్లా పరిధిలోనే ఉంది. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఏలూరుకు చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు పాకలపాటి గాంధీ ఈ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఐదేళ్లపాటు కార్యవర్గంతో పనిచేశారు. ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ నుంచి కోట్ల రూపాయల నిధులు తెచ్చి సంస్థలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేప ట్టారు. నూతన భవనం నిర్మించారు. అప్పటికి పశువుల సీరం కోసం వినియోగించే ద్రవ నత్రజని ఆరు వేల లీటర్ల ట్యాంకు మాత్రమే ఉండేది. అది సరిపోకపోవడంతో పది వేల లీటర్ల పరిమాణం కల్గిన మరో ట్యాంకును నిర్మించారు. ఐదేళ్ల పదవీ కాలం పూర్తవడం, ఈలోగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ కార్యవర్గాన్ని మరో ఐదేళ్లపాటు పొడిగించాలని కోరుతూ కోర్టుకు వెళ్లారు. కోర్టు కూడా వీరికి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో మరో నాలుగేళ్లపాటు పాత కార్యవర్గమే కొన సాగింది. ఈ తరుణంలో పెంటపాడు మండలం మండలం పడమరవిప్పర్రుకు చెందిన మాజీ ఎమ్మెల్యే పసల కనక సుందరరావు అప్పటి సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. జగన్ ఆదేశాల మేరకు పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా 2023 డిసెంబరులో కనకసుందరరావు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పాత కార్యవర్గాన్ని రద్దు చేస్తూ ఆదేశాలు జారీచేసింది. దీంతో ఆ కార్యవర్గ సభ్యులు ఆరు నెలలు మాత్రమే అధికారంలో ఉన్నారు.అనంతరం తమ కార్యవర్గాన్ని ఐదేళ్లపాటు కొన సాగించాలని కోరుతూ వైసీపీ కార్యవర్గ సభ్యులు కోర్టుకు వెళ్లారు. సంస్థ కార్యవర్గ పదవులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు రాష్ట్రంలో ఖాళీగా వున్న నామినేటెడ్ పోస్టుల భర్తీకి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ఈ చైర్మన్ పదవి ఎవరికి దక్కనుందోనని అంతటా ఉత్కంఠ నెలకొంది. చైర్మన్ పదవి కోసం ఉమ్మడి పశ్చిమలోని పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల నుంచి కూటమి పార్టీల్లోని సీనియర్లు దృష్టి పెట్టారు.

బర్లమడుగు అటవీ ప్రాంతంలో అడవి జంతువు వేట?

కుక్కునూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బర్లమడుగు అటవీ ప్రాంతంలో అడవిదున్నను వేటాడినట్లు ప్రచారం సాగుతోంది. నాలుగు రోజుల క్రితం ఉచ్చులు పెట్టి అడవిదున్నను హతమార్చినట్లు తెలుస్తుంది. అనంతరం ఆ మాంసాన్ని వాటాలు వేసుకుని పంచుకున్నట్లు తెలిసింది.ఈ సమాచారం తెలిసిన అమరవరం అటవీశాఖ రేంజర్ సత్య పద్మజ గురువారం బర్లమడుగులో క్షేత్ర స్థాయిలో విచారణ జరిపారు. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నాయి.



కాల్వలోకి దూసుకెళ్లిన కారు.. తప్పిన ప్రమాదం

పాలకోడేరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భీమవరం నుంచి వేండ్ర వెళ్లే రహదారిలోని జీఅండ్‌వీ కెనాల్‌లోకి ఒక కారు దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. భీమవరం వైపు నుంచి విస్సాకోడేరు లాకుల రోడ్డు మీదుగా వేంద్ర గ్రామం వెళ్లేందుకు వెర్నా కారులో ఇద్దరు బుధవారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో వెళ్తున్నారు. లాకుల సమీపంలో ఐస్ ఫ్యాక్టరీ ఎదురుగా వచ్చేసరికి అదుపు తప్పి నేరుగా కాలువలోకి దూసుకుపోయింది. చిమ్మచీకటిగా ఉండటంతో ఆ కారులో ఉన్న ఇరువురు వ్యక్తులు బయటకు రాలేకపోతున్నారు. అదే సమయంలో పాలకోడేరు గ్రామానికి చెందిన గోపీ అనే యువకుడు ఆ కారుని చూసి వెంటనే స్థానికుల సహాయంతో ఆ ఇద్దరు వ్యక్తులను బయటకు తీశారు. ఇదే ప్రాంతంలో కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్ నుంచి సంక్రాంతి పండుగకు వచ్చి తిరిగి వెళ్తుండగా కారు కాలువలోకి దూసుకుపోయి ముగ్గురు మృత్యువాత పడ్డారు. అదే ప్రాంతంలో మళ్లీ కారు కాలువలోకి దూసుకెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. బుధవారం రాత్రి పోలీసులు ప్రమాద స్థలం వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు.

చికిత్స పొందుతూ ఉపాధి కూలీ మృతి

మొగల్తూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు జాతీయ రహదారిని అనుకుని ఉపాధి కూలి పనులు చేస్తున్న వారిని బుధవారం ఉదయం వ్యాన్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మహిళలు మృతి చెందగా మరో ఇద్దరు వ్యక్తులు ఆసుపత్రి పాలయ్యారు. వీరిలో గుబ్బల మాణిక్యాలరావు (57)కు తీవ్ర గాయాలవ్వడంతో నరసాపురం ఏరియా ఆసుపత్రి నుండి భీమవరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి బుధవారం మెరుగైన వైద్యం కోసం తరలించారు. ఆరోగ్యం నిలకడగా లేకపోవడంతో గుంటూరు జీజీహెచ్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఇదే ప్రమాదంలో మృతుని భార్య గుబ్బల గంగాదేవి బుధవారం ప్రమాదం జరిగిన వెంటనే మృతి చెందారు. ఈ ప్రమాదంలో భార్య, భర్త ఇద్దరు మృతి చెందడంతో స్థానికులు కలత చెందారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. సీఐ దుర్గా ప్రసాద్,ఎస్ఐ వాసు, రెవెన్యూ అధికారులు, ఉపాధిహామీ పథకం అధికారులు గుంటూరుకు తరలివెళ్లారు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

ఆటో- కారు ఢీ.. ఇద్దరికి గాయాలు

పెనుమంట్ర, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పెనుమంట్ర శివారు బ్రాహ్మణ చెరువు కొండాలమ్మ గుడి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకినాడ నుంచి వీరవాసరం వెళ్తున్న బ్రాహ్మణ చెరువు నుంచి మార్టేరు వెళుతున్న ఆటోను ఢీకొన్న సంఘటనలో ఇరువురు గాయాలపాలయ్యారు క్షతగాత్రులను అత్యవసర వాహనంలో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు ఫస్ట్ ఎయిడ్ అనంతరం పాలకొల్లు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న పెదకాపు రామారావు, పెనుమంట్రకు చెందిన సత్తి పద్మావతి తీవ్రగాయాలయ్యాయి కారులో బెలూన్ ఓపెన్ అవడంతో కారు డ్రైవర్ గుడిమెట్ల విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రయాణిస్తున్న కుర్మాల అనిల్ కుమార్ సురక్షితంగా బయట పడ్డారు కారు ఆటోని ఢీకొన్న సంఘటనలో పక్కనే ఉన్న ధాన్యపు ఆరబెట్టిన ప్రాంతానికి ఆటో నిలిచి పోయింది. ఢీకొన్న కారు కొండాలమ్మ గుడి దాటి ఆగింది. ధాన్యం ఆరపెడుతున్న రైతులు రోడ్డు ప్రమాదం చూసి బెంబేలెత్తి పోయారు. పెనుమంట్ర పోలీసులు వివరాలు సేకరించారు.

క్రైమ్ కార్నర్

రిమాండ్ ఖైదీ మృతిపై విచారణాధికారిగా ఏలూరు ఆర్డీవో

ఏలూరు క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గంధం శాంతకుమారి గత మార్చి 30వ తేదీన మరణించిన సంఘటనపై ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్‌ను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి విచారణ అధికారిగా నియమించారు. ఈ సంఘటనపై విచారణాధికారి, ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ ఈనెల 25వ తేదీన ఉదయం 11 గంటలకు ఏలూరు ఆర్డీవో కార్యాలయంలో విచారణ నిర్వహిస్తారని, ఈ సంఘటనకు సంబంధించి వివరాలు సమాచారం అందించే వ్యక్తులు ఈనెల 25వ తేదీన ఉదయం 11 గంటలకు ఏలూరు ఆర్డీవో కార్యాలయానికి హాజరై సంఘటనకు సంబంధించి తమ వాంగ్మూలం ఇవ్వవచ్చని ఒక ప్రకటనలో తెలిపారు.

ఐస్ క్రీమ్, కూల్‌డ్రింక్ షాపుపై విజిలెన్సు దాడులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గడువు తీరిన ఎసెన్స్ ఫ్లేవర్స్, ఐస్ క్రీమ్ తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలు గడువు తీరినవి, నాశిరకాలతో రకరకాల ఐస్‌క్రీమ్‌లు, డ్రింక్‌లను తయారు చేస్తున్నట్టు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీరాంబాబుకు ఫిర్యాదు అందింది. విజిలెన్సు సీఐ ప్రసాద్ కుమార్, ఎస్ఐ నాగరాజు, ఆహార తనిఖీ అధికారి నాగరాజు, వారి సిబ్బంది కలిసి ఏలూరు చందన బ్రదర్స్ కింద ఉన్న గౌతమి కూల్ డ్రింక్స్ అండ్ ఐస్‌క్రీమ్ షాపుపై గురువారం మధ్యాహ్నం దాడులు చేశారు. అక్కడ ఉన్న పరిస్థితులను చూసి అధికారులే అవాక్కయ్యారు. 14 రకాల ఎసెన్స్, ఫ్లేవర్స్ గడువు తీరినవి ఉండడాన్ని గుర్తించారు. ఒకబాదం మిక్స్, ద్రాక్ష మిక్స్ నమూనాలను విశ్లేషణ పరీక్షల నిమిత్తం ల్యాబ్‌నకు పంపడానికి సీజ్ చేశారు. ఆహార భద్రత చట్టం క్రింద వారిపై కేసు నమోదు చేశారు. అంతే కాకుండా గడువు తీరిని ముడిపదార్థాలను వినియోగించడం, వివిధ రసాయనాలను వినియోగించడంపై వారిపై ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయించారు.

మహిళపై అత్యాచారం

చింతలపూడి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి మండలం రేచర్ల గ్రామానికి చెందిన ఒక మహిళ (55)పై అదే గ్రామానికి చెందిన చందు అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడినట్టు ఎస్ఐ కుటుంబరావు తెలిపారు. ఎర్రగుంటపల్లి సమీపంలో గుడికి వెళ్లి వస్తుండగా చందు అనే వ్యక్తి తాను ఇంటికి తీసుకువెళ్తానని మోటరు సైకిల్‌పై ఎక్కించుకుని ఎర్రకాలువ సమీపంలో అత్యాచారానికి పాల్పడినట్టు తెలిపారు. ఆమెను వైద్యం నిమిత్తం ఏలూరు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడి పుట్టినరోజని భద్రాచలం వెళుతూ..

- లారీని ఢీకొట్టిన కారు
- బీటెక్ విద్యార్థి మృతి
- నలుగురికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి వద్ద ప్రమాద స్థలం వద్ద నుజ్జునుజ్జయిన కారు.. రోడ్డుపై పడిఉన్న క్షతగాత్రులు





మృతుడు కోమటి స్వామి (ఫైల్) తీవ్రంగా గాయపడ్డ హేమంత్, రాహుల్

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వారంతా ఇంజనీరింగ్ విద్యార్థులు.. స్నేహితుడి పుట్టినరోజు సందర్భంగా భద్రాచలం శ్రీరాముని దర్శించుకుందామని కారులో బయలుదేరారు. దారిలో లారీని ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి వద్ద జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో టి.నరసాపురం మండలం మెట్టగూడెం గ్రామానికి చెందిన కోమటి స్వామి (20) ఘటనా స్థలంలోనే మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషమంగా ఉంది. భద్రాచలం శ్రీరాముడిని దర్శిం చుకోవడానికి కారులో బయలుదేరిన ఎనిమిది మంది ఇంజనీరింగ్ విద్యార్థులు గురువారం ప్రమాదానికి గురయ్యారు. కొయ్యలగూడెం మండలం అంకాలగూడెంకు చెందిన కోమటి కుంట ప్రమోద్, కొయ్యలగూడెంలోని కొత్తూరుకి చెందిన చింతా రాహుల్ కృష్ణ, విజయ నగరం జిల్లా వీరసాగరం గ్రామానికి చెందిన జి.హేమంత్, కొయ్యలగూడేనికి చెందిన బెల్లాన అజయ్, బుట్టాయగూడేనికి చెందిన గరికపాటి హరిహరణ్, జంగా రెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన చిన్నం శ్రీనివాస్, శ్రీకాకుళం జిల్లా పాలంగికి చెందిన దుంగా నరేష్, టి.నరసా పురం మండలం మెట్టగూడేనికి చెందిన కోమటి స్వామి (20) స్నేహితులు. వీరంతా తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. తమ స్నేహితుడు దుంగా నరేష్ పుట్టినరోజు సంద ర్భంగా భద్రాచలం శ్రీరాముడిని దర్శిం చుకుని అక్కడ వేడుకలు చేసుకుందామని అనుకున్నారు. గురువారం ఉదయం తాడేపల్లి గూడెంలో మారుతి స్విఫ్ట్ కారును అద్దెకు తీసుకున్నారు. అక్కడి నుంచి ఏడు గురు విద్యార్థులు ఒకే కారులో బయలుదేరారు. వారిలో ఒకడైన బి.అజయ్ కారు డ్రైవ్ చేస్తున్నాడు. కొయ్యలగూడెంలో వారి స్నేహితుడైన కోమటి కుంట ప్రమోద్‌ను ఎక్కించుకున్నారు. ముందు సీటులో డ్రైవింగ్ చేస్తున్న అజయ్‌తో పాటు ఇద్దరు, వెనుక సీటులో ఐదుగురు కూర్చున్నారు. తాడువాయి జాతీయ రహదారి వద్దకు చేరుకునే సరికి కారు ప్రమాదవశాత్తు రోడ్డు మార్జిన్ దిగి పోయింది. ఈ క్రమంలో కారును రోడ్డు ఎక్కిస్తుండగా ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు రివర్స్‌లో తిరుగగా వెనుక భాగంలో లారీ కారును అతి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు వెనుక భాగం నుజ్జును జ్జయింది. కారు వెనుక సీటులో కూర్చున్న కోమటిస్వామి తలకు గాయాలవ వడంతో తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జె.హేమంత్, రాహుల్ పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరు ప్రమోద్, హరిహరణ్‌లు కూడా గాయపడ్డారు. 108 అంబులెన్సులో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం రాహుల్, హేమం త్‌లను వారి బంధువులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హేమంత్‌ను ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తర లించారు. అజయ్, నరేష్‌లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు సీఐ కృష్ణబాబు, ఎస్ఐ జబీర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కోమటి స్వామి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.



గన్నిని సన్మానిస్తున్న శేషగిరి

గన్నికి ఏఎంసీ చైర్మన్ శేషగిరి సన్మానం

భీమడోలు : భీమడోలు ఏఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన శేషపు శేషగిరి గురువారం భీమడోలులోని గన్ని క్యాంపు కార్యాలయంలో గన్ని వీరాంజనేయులను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు టీడీపీ నాయకులు శేషపుగిరి పాల్గొన్నారు.

అప్పల స్వామి సేవలు ఆదర్శనీయం : సీపీఐ

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ కార్మిక సంఘ నాయకులు, సీపీఐ నాయకులు పూడి అప్పలస్వామి 20వ వర్ధంతిని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కొత్తపేటలోని గౌరీదేవి మందిరం సమీపంలోని అప్పల స్వామి స్మారక స్థూపం వద్ద సీపీఐ పతాకాన్ని జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఆవిష్కరించారు. అనంతరం అప్పలస్వామి విగ్రహానికి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

దూదేకుల సామాజిక వర్గానికి న్యాయం చేయాలి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నూర్ బాషా (దూదేకుల) సామాజిక వర్గానికి నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని గోపాలపురం నియోజకవర్గ నూర్‌బాషా సంఘ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ కోరారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాతో పాటు రాయలసీమ ప్రాంతంలో అధికంగా ఉన్న నూర్‌భాషాల పట్ల చిన్న చూపుతగదన్నారు. నలుగురు ఎమ్మెల్యేలు, ఓ బోర్డు చైర్మన్, మైనార్టీ కార్పొరేషన్, మంత్రి పదవితో పాటు ప్రభుత్వ సలహాదారు పదవిని ముస్లిం మైనార్టీలకు కేటాయించి నూర్ బాషాలను పక్కన పెట్టడం సమంజసం కాదన్నారు. ముస్లిం మైనార్టీలకు కేటాయించే నామినేటెడ్ పదవుల్లో 30 శాతం నూర్ భాషాలకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నూర్‌భాషా జిల్లా అధ్యక్షుడు ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌ఆర్ పీజీ కళాశాలలో క్యాంపస్ ఎంపికలు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : ఫార్మసీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు హైదరాబాద్, విశాఖపట్నంలోని లారస్ ల్యాబ్స్‌లో వివిధ ఉద్యోగాలు ఇచ్చేందుకు గురువారం సీఆర్‌ఆర్ పీజీ కళాశాలలో క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించారు.ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన 65మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు సంస్థ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డి.సునీత, జీఎం రవీంద్రనాథ్ తెలిపారు. ఎంపికైనవారిని కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, డైరెక్టర్ యలమర్తి బాబు, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ సుబ్రహ్మణ్యం, ఎంబీఏ ప్రొఫెసర్ టి.రాజేశ్ అభినందించారు.

ప్రజలపై భారాన్ని ఉప సంహరించుకోవాలి

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న భారాలు ఉప సంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర నాయకులు బి.బలరాం, మంతెన సీతారాంలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పవరుపేటలోని ఉద్దరాజు రామం భవనంలో సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మొడియం నాగమణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.ఎన్.వి.డి.ప్రసాద్, ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, జి.రాజు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, ఇతర జిల్లాల నాయకులు ఎం.జీవరత్నం, ఎ.ఫ్రాన్సిస్, మడకం సుధారాణి, వై.నాగేంద్రరావు, ఎస్.మహంకాళిరావు, హనుమాన్, సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ నిర్వాసిత కాలనీల్లో మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు కల్పించాలని, కొల్లేరు ప్రజలను రక్షించాలని, ఆక్వా రంగాన్ని కాపాడాలని, రొయ్యల రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు న్యాయం చేయాలి

చింతలపూడి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని, చింతలపూడి మార్కెట్ యార్డు చైర్మన్ పదవి బీసీలకు ఇవ్వాలంటూ బీసీ నాయకులు డిమాండ్ చేశారు. వీకేఎం ఫంక్షన్ హాల్లో నాలుగు మండలాలకు చెందిన బీసీ నాయకులు పాల్గొని మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో 34 శాతం బీసీలకు అవకాశం కల్పించాలని బీసీ సెల్ అధ్యక్షులు పిల్లల శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. చింతలపూడి నియోజకవర్గంలో లక్ష మంది బీసీ ఓటింగ్ ఉందని, కాబట్టి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. నాలుగు మండలాల పార్టీ అధ్యక్ష పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో బీసీ నాయకులు దాసరి శ్యాం చంద్రశేఖ, సాయల సత్యనారాయణ, చెన్ను శ్రీనివాస్ యాదవ్, మరీదు వెంకట్రావు, కొప్పెర్ల నాగరాజు, యువరాజు, పామర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

టీటీడీ గోశాలపై అసత్య ప్రచారం సరికాదు

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా తిరుమల గోశాలలో గోవులు మృతి చెందుతున్నాయంటూ భూమన కరుణాకర్ రెడ్డి అసత్య ప్రచారం చేయడం సరికాదని ఎమ్మెల్యే బడేటి చంటి మండిపడ్డారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తిరుమల పవిత్రతను కాపాడుతూ భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించేలా కుట్రలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను ఆమోదిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంతో దళిత నేతలు ఎమ్మెల్యే చంటిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు, క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షులు జుంజు మోజేశ్, మాజీ కార్పొరేటర్ జిజ్జవరపు ప్రతాప్ కుమార్, వెంకట రమణ, మెలిపాక వెంకట రమణ, వి.శ్యామల రావు, నేతర అశోక్, ఎం.పాలస్, మట్టా రంజిత్ పాల్గొన్నారు.

కొల్లేరు సమస్య పరిష్కారానికి వెసులుబాటు

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ప్రాంత ప్రజల వాదనలు వినిపించేందుకు సుప్రీంకోర్టు మూడు నెలలు వెసులుబాటు కల్పించడం శుభపరిణామం అని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ పేర్కొన్నారు. కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి ఇది మొదటి అడుగన్నారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వాలు చేసిన కృషి ఫలించిందన్నారు. కొల్లేరు సరిహద్దులు నిర్ణయించాలని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అధికారులు చేపట్టిన చర్యలకు ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారన్నారు. దీంతో ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు సీఎం కలిసి పరిస్థితి వివరించారని దాని ఫలితంగానే సుప్రీంకోర్టు గడువునిచ్చిందన్నారు.

కళాకారులకు కందుకూరి పురస్కారం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా కందుకూరి పురస్కారాన్ని జిల్లాకు చెందిన ఇద్దరికి ప్రదానం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంత్రి కందుల దుర్గేశ్ చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఏలూరుకు చెందిన పెదపాటి రామకృష్ణ హేలాపురి కళాకారుల సంఘాన్ని స్థాపించి కళాకారులను ప్రోత్సహిస్తున్నందుకు, కొయ్యలగూడేనికి చెందిన రంగస్థల నటుడు మహాశివభట్టు వెంకట రాజర్షిని పురస్కారంతో సత్కరించారు.

గురుశర్మకు తెలుగు సాహితీ సంబరాల నుంచి ఆహ్వానం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు పట్టణం మహాలక్ష్మీ గోపాలస్వామి కల్యాణ మండపంలో మే 11, 12 తేదీల్లో రెండు రోజుల పాటు ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు నిర్వహించనున్నారు. అంతర్జాతీయ సీఈవో కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సంబరాలకు ప్రముఖ కవి సాహితీవేత్త గురుశర్మకు ఆహ్వానం అందింది. ఈ బృహత్తరమైన ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు కార్యక్రమంలో భాగస్వాములు కావాలని లేఖలో కోరారు. ఈ సందర్భంగా గురుశర్మ మనం సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లబోట్ల పురుషోత్తం హర్షం ప్రకటించారు.

ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీకి ఉపాధ్యాయుల సత్కారం



సన్మానిస్తున్న ఉపాధ్యాయుల బృందం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఇటీవల ఎన్నికైన గాదె శ్రీనివాసులు నాయుడు ప్రమాణస్వీకారాన్ని పురస్కరించుకుని పీఆర్టీయూ ఏలూరు జిల్లా నాయకులు పి.ఆంజనేయులు నేతృత్వంలో విజయవాడలో ఘనంగా సత్కరించారు. ఆంజ నేయులు మాట్లాడుతూ తక్షణమే 12వ పీఆర్సీ కమి షన్‌ను నియమించేలా, మధ్యంతర భృతి(ఐఆర్)ని ప్రకటించేలా ప్రభుత్వంపై ఒత్తిడితేవాలని ఎమ్మెల్సీని అభ్యర్థించారు.సత్కరించిన వారిలో రాజేశ్వరి, లక్ష్మీభీమేశ్వరి, ధర్మారావు, డేవిడ్, ప్రసాద్, ఏసు రాజు, సుధాకర్, సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ రైతుల చర్చలు సఫలం

చింతలపూడి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సీతానగరం గోద్రేజ్ ఆగ్రోవెట్ యాజమాన్యంతో ఆయిల్ పామ్ రైతులు జరిపిన చర్చలు సఫలమైనట్టు ఆయిల్ పామ్ రైతు సంఘ నాయకులు పి.రామరాజు, పి.సోమశేఖర్ తెలిపారు. ప్రధానంగా తెగుళ్లకు విరుగుడు మందులు రైతులకు సరఫరా చేయాలని, మొలాసిస్‌ను రైతులకు ఉచితంగా ఇవ్వాలని, గెలల ధర వివరాలు కూడా రైతులకు ఇచ్చే మెసేజ్‌లో పొందుపర్చాలని ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చలు జరిపారు. చర్చల్లో రైతు సంఘ నాయకులు కారుమూడి రమేష్,తెగడ వెంకన్న, పిడపర్తి ముత్తారెడ్డి, జి.సోమేశ్వరరావు, ప్రత్తి కోటేశ్వరరావు, పలువురు యర్రగుంటపల్లి పరిసర గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

చేతికి అందే అంత ఎత్తులో విద్యుత్ వైర్లు



రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలోని వెంకటాపురం పంచాయతీ కనకదుర్గమ్మ ఆలయ రోడ్డులోని మస్తాన్ మన్యం కాలనీ ఎంపీయూపీ పాఠశాల సమీపంలో రోడ్డు మార్జిన్‌లోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ విద్యుత్ వైర్ల సముదాయం వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు మార్జిన్‌లో ఉండడమే కాకుండా చిన్న పిల్లలకు సైతం విద్యుత్ వైర్లు అందేలా బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో ఏ నిమిషాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆ ప్రాంత ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో పాఠశాల, మరోపక్క దేవాలయం ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అందుకే ప్రమాదం జరిగే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ఈ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌కు రక్షణ గోడలు ఏర్పాటు చేసి, విద్యుత్ వైర్లను సరిచేయాలని స్థానికులు సూచిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌పై సర్వత్రా హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న పల్లె శ్రీనివాస్

చింతలపూడి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై మంత్రివర్గ ఆమోదం పొందడం హర్షణీయమని నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పల్లె శ్రీను పేర్కొన్నారు. ప్రభుత్వం సుప్రీంకోర్టు డైరెక్షన్ ప్రకారం ఏపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్ జారీ చేస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఏపీలో రాజీవ్‌రంజన్ మిశ్ర ఏకసభ్య కమిషన్ ఇచ్చిన రిపోర్టును, మంత్రి మండలి ఇచ్చిన రిపోర్టును బేస్ చేసుకుని ప్రభుత్వం ఆర్డినెన్స్ ఇచ్చిందని, దీని వల్ల రాష్ట్రంలో ఉన్న 59 కులాల ఎస్సీలందరికీ సమ న్యాయం జరిగేలా ఉందన్నారు. సమావేశంలో ఎస్సీ నాయకులు జిల్లా కార్యదర్శి బొబ్బర రాజ్‌పాల్, రాష్ట్ర కార్యదర్శి పాతూరి అంబేద్కర్, బొబ్బిలి డాన్, నందపాం నాగేశ్వరరావు, ఎం.సుందరం, డి.విజయ, రాయప్ప పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంటిని కలిసిన నాయకులు..

ఏలూరు టూటౌన్/బుట్టాయగూడెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీక రణకు క్యాబినెట్ ఆమోదం తెలపడంపై టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ సోషల్ మీడి యా కో-ఆర్డినేటర్ మనెల్లి బాలు హర్షం వ్యక్తం చేశారు. బూసరాజుపల్లి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ ఉప కులాల వర్గీక రణకు గతంలో రాజీవ్ రంజన్ మిశ్రా ఇచ్చిన నివేదిక, మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికలపై క్యాబినెట్ చర్చించి అమలుకు ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. డీఎస్సీ నోటిఫికే షన్ తోనే విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సమానంగా అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు వరక కృష్ణంరాజు, ఉపాధ్యక్షుడు కప్పల నాగేశ్వరావు, బి.దాసు, గొల్లపల్లి రాజు పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం ఆమోదం తెలపడం పట్ల మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కందుల రమేశ్ హర్షం వ్యక్తం చేశారు. వర్గీకరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలపడం హర్షనీయమన్నారు. ఏలూరు ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో జరిగిన సమావే శానికి జిల్లా అధ్యక్షులు కె.మురళీ, జి.ప్రసాద్, జీ.రాజేశ్, కొండలరావు, పాల్గొన్నారు.

విద్యార్థుల విహార యాత్రకు చింతమనేని సహకారం



విజ్ఞాన, విహార యాత్రలో పాల్గొన్న చిన్నారులు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) :సమగ్రశిక్ష, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని 252 మందిని ఎంపిక చేసి బాల బాలి కలను విజ్ఞాన, విహార యాత్రలకు తీసుకెళ్లారు. విద్యార్థుల యాత్ర సాఫీగా సాగేందుకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తనవంతు కృషి చేశారు. జిల్లాలోని విద్యార్థులంతా ఒకేచోటకు చేరుకునేలా రవాణా సౌకర్యాన్ని కల్పించడంతో పాటు బుధవారం రాత్రి ఏలూరు అశోక్ నగర్ కేపీడీటీ హైస్కూలు ఆడిటోరియానికి చేరుకున్న విద్యార్థులందరికీ సొంతఖర్చుతో జ్యూస్ ప్యాకెట్లు, వసతి ఏర్పాట్లు చేశారు. ఏలూరు నుంచి హైదరాబాద్‌కు 5 ఆర్టీసీ బస్సుల్లో బయల్దేరిన విద్యార్థులందరికీ ఎమ్మెల్యే వీడ్కోలు పలికారు. హైదరాబాద్‌లో గురువారం మ్యూజియం, గోల్కొండ కోట, బిర్లా ప్లానిటోరియం, చార్మినార్, తదితర పర్యాటక ప్రాంతాలను సందర్శించిన అనంతరం విద్యార్థులందరికీ భోజనం పెట్టించడం విశేషం.. ఈ మేరకు ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ ప్రతి అంశాన్ని సుదీర్ఘంగా పరిశీలించడం, శోధించడం, విశ్లేషించడం వంటి అనేకాంశాలను సైన్సు నేర్పిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థి దశలోనే సైన్సు పట్ల ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని రూ.50 వేలు ఖర్చుచేసి విద్యార్థులందరికీ హైదరాబాద్ బిర్యానీని రుచి చూపించడం,దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించడం పట్ల అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. యాత్ర నిర్వహణ ఏర్పాట్లలో ప్రధానోపాధ్యాయుడు వడ్లపట్ల మురళీకృష్ణ, టీడీపీ నాయకులు ఉప్పలపాటి రాంప్రసాద్, కడియాల కృష్ణారావు, తదితరులున్నారు.

మంచినీటి ట్యాంకు ప్రారంభం



సోము వీర్రాజుకు ఆహ్వానం పలుకుతున్న నాయకులు

భీమడోలు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : వడ్లపట్లలో 15 లక్షల రూపాయల సొంత ఖర్చుతో నిర్మించిన నీటి ట్యాంకును గ్రామస్థులు సద్వినియోగపర్చుకోవాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు కోరారు. భీమడోలు శివారు వడ్లపట్లలో బీజేపీ నాయకులు వర్ధినీడి కపిరాజు, వారి తల్లిదండ్రులు వీరాంజనేయులు, సీతామహాలక్ష్మి జ్ఞాప కార్థం రూ.15 లక్షలతో వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. ఈ ట్యాంకు ప్రారంభోత్సవానికి సోము వీర్రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకం పకడ్బందీగా అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, ఏలూరు జిల్లా బీజేపీ అధ్యక్షులు విక్రమ్ కిశోర్, భీమడోలు మండలాధ్యక్షులు మూర్తి, ప్రవీణ్ కుమార్ పటేల్, వెజ్జు ధర్మారావు, జనసేన నాయకులు ప్రత్తిమదన్, చక్రవర్తి వర్మ, మామిడిపల్లి కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఘనంగా వేదాంత మహా సభలు



ఎమ్మెల్యే చింతమనేనిని సత్కరిస్తున్న ఆశ్రమ పీఠాధిపతి

పెదవేగి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : ముందూరులో శ్రీయజ్ఞవల్క్య రాజాశ్రమం 67వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ మేరకు ఏర్పాటు చేసిన వేదాంత మహా సభలను ఎమ్మెల్యే ప్రభాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఆధ్యాత్మికతను, సనాతన ధర్మాలను ప్రజలకు మరింత చేరువ చేసేలాగా పీఠాధిపతులు, మఠాధిపతులు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఆశ్రమ పీఠాధిపతి శ్రీకృష్ణ చరణానంద భారతి స్వామి మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కృషి అభినందనీయమన్నారు.తొలుత ఎమ్మెల్యే ప్రభాకర్‌ను స్వామీజీలు శాలువాతో సత్కరించారు. వేదాత మహాసభలకు దేశం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో స్వామీజీలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : ఏలూరు ఆర్ఆర్‌పేటలోని ఏలూరు పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ గురువారం అవగాహన కల్పించింది. జిల్లా అదనపు అగ్నిమాపకశాఖ అధికారి వి.రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు అగ్గిపెట్టెలతో ఆటలు ఆడకూడదని, బాణసంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అపార్టుమెంటులో ఉన్న వారు ప్రమాదాలు జరిగినప్పుడు చేయాల్సిన పద్ధతిని వివరించారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన

టి.నర్సాపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లు నిరసన బాట పట్టారు. రాష్ట్ర కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు పీహెచ్‌సీ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర, ఓపీ సేవలు మినహా మిగతా అన్ని సర్వేలు ఆన్‌లైన్ వర్క్స్ నిలుపుదల చేసినట్లు తెలిపారు. సమ్మె నిమిత్తం మెడికల్ ఆఫీసర్ ఫణీంద్రబాబుకు నోటీసులివ్వగా ఆయన తీసుకోవడానికి నిరాకరించారని తెలిపారు. ఈ నేపథ్యంలో కంప్లైంట్ బాక్సులో నోటీసీఉలు వేసి కార్యచరణలో భాగంగా శాంతియుత నిరసన చేపట్టినట్టు తెలిపారు. న్యాయమైన డిమాండ్ల వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్.కె.రాజు, ఎస్.సిద్దియ్య, నాగబాబు, ఎస్.విజయరామరాజు, వి.రాజ్యలక్ష్మి, అనూష, ప్రసన్న కుమారి, తదితరులు పాల్గొన్నారు.

శిశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : శిశువుల ఆరోగ్య పరిరక్షణకు బాలింతలు పోషకార లోపాన్ని భర్తీ చేయడంతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా అన్నారు. ద్వారకా తిరుమల ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా జంగారెడ్డి గూడెం సెక్టార్ అధికారులు వివిధ అంశాలపై మహిళలకు అవగాహన కల్పించడంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహిళా పోలీస్ పి.లక్ష్మీ సుజన ఈ కార్యక్రమానికి హాజరైన మహిళలకు ఐరన్ లోపం వల్ల కలిగే ఇబ్బందులు,వాటిని ఎలా అధిగమించాలో వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మేరీ, మండలంలోని అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నాం



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అధ్వానంగా తయారైన రోడ్లను పునర్నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే చంటి అన్నారు. 19వ డివిజన్ బూరాయిగూడెంలో ఎమ్మెల్యే పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి రోడ్లు, డ్రైన్లు సరిగా లేవని వాటిని ఆధునీకరించాలని ఫిర్యాదులు వచ్చాయన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంపై దృష్టి సారించినట్టు తెలిపారు. ఇప్పటికే నగరంలో రోడ్లపై గుంతలు పూడ్చించినట్టు తెలిపారు. ఆర్ఆర్ పేట, బిర్లా భవన్ సెంటర్‌లో కోటి రూపాయలతో రోడ్లు నిర్మించామన్నారు. శాంతి నగర్ మన్నాచర్చ్ రోడ్డును రూ.4 కోట్లతో నిర్మించామన్నారు. బూరాయిగూడెం, మారడాని రంగరావు కాలనీ, రాజా కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నానని ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పైడి వెంకట్రావు, అంబటి రజనీకుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉంగుటూరులో రైస్ మిల్లు ప్రారంభం



రైస్ మిల్లు ప్రారంభోత్సవంలో పాల్గొన్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యేలు

ఉంగుటూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం ఇస్తున్నాయని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. గురువారం ఉంగుటూరులో ఓ రైస్ మిల్లును ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి వర్మతో కలిసి తాడేపల్లిగూడెం, ఉంగుటూరు ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజులు మిల్లును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎంపీ మాగంటి బాబు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, రైస్ మిల్లు యజమాని గ్రంధి సాయిబాబా వర ప్రసాద్, పసుపులేటి వెంకట రామారావు, నరిశే సోమేశ్వరరావు, గ్రంధి నాగ వెంకట మణి కుమార్‌లు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

భూముల రీ సర్వేతో సమస్యలకు పరిష్కారం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : రైతులు భూముల రీ సర్వేలో పాల్గొని సమస్యలకు పరిష్కారం పొందాలని ఏలూరు రూరల్ మండలం తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామంలో గురువారం రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఉన్న భూముల సమస్యలు రీ సర్వేతో పరిష్కారం అవుతాయన్నారు. భవిష్యత్‌లో ఇబ్బందులు రాకూడదన్న ఉద్దేశంతో రీసర్వే చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరామ్ ప్రభుదేవ, నీటి సంఘం అధ్యక్షుడు సాల్మన్‌రాజు, టీడీసీ నాయకుడు పైడిపాటి శేఖర్‌బాబు, ఎం.పవన్ కుమార్, జాలిపూడి సొసైటీ అధ్యక్షుడు కోసూరి సుబ్బారావు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, పంచాయతీ సెక్రటరీ సుమలత, మాదేపల్లి రైతులు పాల్గొన్నారు.

షిర్డీ సాయి మందిరాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో షిర్డీ సాయి

కామవరపుకోట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కామవరపుకోట, కొత్తూరు, పాతూరు, రామన్నపాలెం, మద్దిపోటి వారి గూడెం గ్రామాల్లోని షిర్డీ సాయి మందిరాల్లో గురువారం ఘనంగా అన్నప్రసాద వితరణను చేపట్టారు. సాయి భక్తులు అధిక సంఖ్యలో బాబాను దర్శించుకుని అన్న ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం జరిగిన పల్లకీ సేవల్లో అధిక సంఖ్యలో భక్తులు సాయినామ సంకీర్తనలు ఆలపిస్తూ భజనలు చేస్తూ భారీ సంఖ్యలో పాల్గొనడం విశేషం. ఈ మేరకు గ్రామాల్లో సాయినాధుని పల్లకీ సేవా కార్యక్రమాలతో సందడి నెలకొంది.



అలుగు ఆనంద శేఖర్‌తో దళిత సంఘ నాయకులు

దళిత సేన కార్యదర్శిగా అలుగు

జంగారెడ్డిగూడెం,ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : భారత్ దళిత సేన జాతీయ కమిటీ కార్యదర్శిగా అలుగు ఆనంద శేఖర్‌ను నియమించి నట్టు కమిటీ జాతీయ అధ్యక్షుడు బి.స్వామి గురువారం తెలిపారు. గురువారం బి.స్వామి జంగారెడ్డిగూడెం విచ్చేసిన సందర్భంగా మాట్లాడుతూ త్వరలో ఢిల్లీలో జరగబోయే జాతీయ కార్యవర్గ సమావేశంలో తమ కార్యాచరణను తెలియజేస్తామన్నారు. అనంతరం అలుగు ఆనంద శేఖర్‌ను స్వామి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.కిషోర్, ఎం.రవి పాల్గొన్నారు.

నేటి నుంచి నాగాశ్విని ఆలయ ఉత్సవాలు

దెందులూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : పేరంటాలమ్మ ఉత్సవాలు శుక్రవారం నుంచి ముగ్రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతాయని నాగాశ్విని దేవాలయ నిర్వాకులు పూజారి శ్రీనివాసరావు, కనకదుర్గ, పూజారి అన్నవరం దుర్గమ్మ దంపతులు తెలిపారు. ఈ ఉత్సవాలను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ముడవ రోజు సందర్భంగా ఆలయ అవరణలో భారీ అగ్ని గుండం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మేరకు ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

చింతలపూడి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి మండలం నర్సింగపురం గ్రామానికి చెందిన ఎం.సూరిబాబుకు జనసేన పార్టీ మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు చేతుల మీదుగా రూ. 22 వేల ఆర్థిక సాయం అందించారు. ఆ కుటుంబంలో తండ్రి చనిపోవడంతో నిరుపేద కుటుంబానికి చెందినది కావడంతో జనసేన పార్టీ ఈ సహాయం అందించిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నలగొపు సూర్య చంద్రరావు, మాదాసు రాంబాబు, అజయ్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థినులకు అవగాహన

కుక్కునూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఏలూరు సమగ్ర శిక్షణ అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పంకజం, చైల్డ్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి నవీన ఆధ్వర్యంలో బాలికలకు మెంటల్ హెల్త్ అంశంపై అవగాహన కల్పించారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసం, క్రిటికల్ థింకింగ్ తదితర పద్ధతులు వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు స్వాతి, సుశీల, భూలక్ష్మి పాల్గొన్నారు.

ప్రహరీ ప్రారంభం

ఏలూరుసిటీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జడ్పీ అతిథి గృహానికి 10 లక్షల రూపాయలతో నిర్మించిన ప్రహరీ గోడను జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ గురువారం ప్రారంభించారు. 70 మీటర్లు పొడవునా ప్రహరీ గోడ నిర్మాణ పనులను, జడ్పీ జనరల్ ఫండ్ నిధుల నుంచి మంజూరు చేశారు. పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసినట్టు పద్మశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్‌ఈ ఎం.వి.రమణారావు, డీఈ జె.శ్రీనివాస్, డీఆర్‌ఐ డీఈ శ్రీనివాస్, ప్రాజెక్టు డీఈ సురేశ్, జిల్లాలోని జడ్పీటీసీలు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులు కేటాయించాలి

లింగపాలెం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): టీడీపీకి బీసీలు ఎల్లప్పుడూ వెన్నెముకగా నిలిచారని రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల భర్తీలో బీసీలకు 34 శాతం పదవులు ఇవ్వాలని మండల బీసీ సెల్ అధ్యక్షుడు పిల్లల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. చింతలపూడిలో జరిగే నియోజకవర్గ బీసీల ఆత్మీయ సమావేశానికి మండలంలో బీసీలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు ఎన్నో సంవత్సరాలుగా టీడీపీకి అంకితభావంతో పనిచేస్తున్నారని మండలంలో ప్రాధాన్యత గల పోస్టులతో పాటు నియోజకవర్గ స్థాయిలో బీసీలకు పదవులివ్వాలన్నారు. చింతలపూడి ఏఎంసీని బీసీలకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెన్ను శ్రీనివాస్ యాదవ్, మరీదు వెంకట్రావు, తాళం సోంబాబు పాల్గొన్నారు.

రెండు పొగాకు బ్యారన్లు దగ్ధం

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవారిగూడెం గ్రామానికి చెందిన దాకవరపు అర్జునరావు, దాకవరపు రవికృష్ణలకు చెందిన రెండు పొగాకు బ్యారన్లు బుధవారం రాత్రి అగ్నికి ఆహుతయ్యాయి. రెండు పొయ్యిలు, ఆరు రేకుల షెడ్లు పూర్తిగా కాలిపోయాయి. రేకుల షెడ్డులోను, బ్యారన్లలో ఉన్న సుమారు రూ.లక్షలు విలువైన పొగాకు దగ్ధమవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు బాధిత రైతులను గురువారం పరామర్శించారు. ప్రభుత్వం, రైతు సంఘాలు బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎ.పోలవరం సర్పంచ్ బుద్దాల సీతారాముడు, మాజీ జడ్పీటీసీ ముప్పిడి శ్రీనివాసరావు, కనికళ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంస

జంగారెడ్డిగూడెం,ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : తపాలా శాఖ ఇచ్చిన టార్గెట్ పూర్తి చేసి ఉత్తమ సేవలందించిన లక్కవరం అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ షేక్ పకీర్ సాహెబ్‌ను జిల్లా తపాల శాఖ సూపరింటెండెంట్ శ్రీకర్ బాబు అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ మేరకు ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

పోషకాహారంపై అవగాహన

భీమడోలు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు గుండుగొలను సెక్టార్ పరిధిలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణీలు, బాలింతలు తీసుకునే ఆహార నియమాల గురించి సూచనలు చేశారు. సూపర్‌వైజర్ ఎం.కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 27.0

రాసలీలల రాద్ధాంతం !

» విద్యా శాఖలో చర్చ.. సమగ్ర శిక్షలో కట్టు కథల దుష్ప్రచారం!

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగుల రాసలీలల వ్యవహారం ఉపాధ్యాయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఇదే అదనుగా సమగ్ర శిక్షలో మరొకరు సొంత కార్యాలయంలోని ఉద్యోగుల మధ్య ఇదే రకమైన చిచ్చు పెట్టేలా దుష్ప్రచారానికి ఒడిగట్టారు. ఈ పరిణామాలను ఈ రెండు కార్యాలయాల అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. ఉపాధ్యాయ వర్గాల మధ్య జరుగుతున్న ప్రచారం. జిల్లా విద్యా శాఖ కార్యాలయ పరిధిలో ఇద్దరి మధ్య కొంతకాలంగా నెలకొన్న రాసలీలలు ఇటీవల పెద్ద మనుషుల దృష్టికి రాగా ఇరువురికీ చీవాట్లు పెట్టి, ఇకపై అలా జరగకుండా ఒప్పందం కుదిర్చినట్టు తెలిసింది. అయినప్పటికీ ఈ వ్యవహారానికి ముగింపు పలకకుండా కొనసాగిస్తుండటంతో కొద్దిరోజుల క్రితం వారిద్దరూ ఏకాంతంగా ఉన్నపుడు అకస్మాత్తుగా ఇంటి గదిలోకి చొరబడిన కుటుంబ సభ్యులు ఒకరు వీడియోను తీసినట్టు సమాచారం. ఊహించని ఈ పరిణామానికి ఉలిక్కిపడ్డ జంటపై కుటుంబ సభ్యులు దాడికి దిగటం, గాయాలతో ఆసుపత్రుల్లో చేరడంతో హాట్ టాపిక్‌గా మారింది.

సమగ్ర శిక్షలో కట్టుకథల దుష్ప్రచారం

విద్యాశాఖలో ఈ పరిణామాలు జరుగుతున్న నేపథ్యంలోనే సమగ్ర శిక్ష ప్రాజెక్టులో ఏళ్ల తరబడి పనిచేస్తున్న మరొకరు అక్కడి కార్యాలయంలో అలజడి సృష్టించేందుకు కొందరి మధ్య అవాంఛనీయ సంబంధాలు ఉన్నట్టు ప్రచారం ప్రారంభించినట్టు తెలుస్తోంది. తనను ప్రాజెక్టు నుంచి బయటకు పంపేయడానికి కారణమయ్యారన్న అక్కసుతోనే కృత్రిమ కథలు అల్లుతూ ప్రచారం చేయిస్తున్నారు. ఇలా చేయడం ద్వారా ప్రాజెక్టు కార్యకలాపాల్లో ఒకింత అశాంతిని సృష్టించి వ్యక్తిగతంగా పైశాచిక ఆనందాన్ని పొందడానికి ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఈ రెండు పరిణామాల ముగింపు ఎలా ఉంటుందోనన్న ప్రచారం ప్రస్తుతం ఉపాధ్యాయ వర్గాల్లో జరుగుతోంది.



వేగవరంలో జాతీయ రహదారిపై పెట్రోలు సీసాలతో రాస్తారోకో చేస్తున్న చిరువ్యాపారులు

మాకు ఆత్మహత్యలే శరణ్యం..

» వేగవరంలో రోడ్డు పక్కన దుకాణాలను తొలగించే యత్నం

» పెట్రోలు సీసాలతో చిరువ్యాపారుల ఆందోళన

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : తమకు న్యాయం చేయాలని లేదంటే పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడతామని మండలంలోని వేగవరంలో జాతీయ రహదారిపై చిరు వ్యాపారులు పెట్రోల్ సీసాలతో గురువారం రాస్తారోకో నిర్వహించారు. వేగవరంలోని రహదారి ఇరువైపులా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్న వారిని ఖాళీ చేయించేందుకు రెవెన్యూ గురువారం అధికారులు ఎక్స్‌కవేటర్లతో రావడంతో చిరువ్యాపారులు ఆందోళనకు దిగారు. గత నలభై ఏళ్లుగా రోడ్డు పక్కనే చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమపై ఇలా కక్ష సాధింపులు చేయడం సరికాదని తమపై దయ చూపాలని వారు కోరారు. కొంత మంది నాయకులు తమను ఖాళీ చేయించాలని చూస్తున్నారని బాధితులు వాపోయారు. తామంతా తమ దుకాణాలను తొలగించవద్దంటూ కలెక్టరును కలిసి విన్నవించుకున్నామని, చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దని గతంలోనే అధికారులకు చెప్పారని తెలిపారు. కాగా చిరు వ్యాపారులు పెట్రోల్ సీసాలతో ఆందోళన చేయడంతో రెవెన్యూ అధికారులు దుకాణాలను తొలగించకుండా వెనుదిరగడంతో ఆందోళన విరమించారు.

సాంఘిక సంక్షేమశాఖ జేడీ జయప్రకాశ్ బదిలీ

ఏలూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లా సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ వి.జయప్రకాశ్ బదిలీ అయ్యారు. ఆయనను అమరావతి సచివాలయం కార్యాలయం జేడీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను గురువారం జారీ చేసింది. రెండేళ్ల క్రితం జయప్రకాశ్ ఏలూరు జిల్లా జాయింట్ డైరెక్టర్‌గా విధుల్లో చేరారు.

తాళికట్టు శుభవేళ

ఈనెల 30న మంచి ముహూర్తం

రానున్న మూడు నెలల్లో 19 ముహూర్తాలు



జూన్ 10 నుంచి రెండు నెలలు పెళ్లిళ్లకు బ్రేక్

■ లోపలి పేజీలో..



■ లోపలి పేజీలో..

ఏలూరు జడ్పీ హాల్‌లో గురువారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఇన్‌చార్జి కలెక్టర్ ధాత్రిరెడ్డి

మా జిల్లాకు నిధులు ఇవ్వండి

» జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే బొలిశెట్టి డిమాండ్

» ఏజెన్సీలో తాగునీటి సమస్య పరిష్కరించాలి : ఎమ్మెల్యే బాలరాజు



• తీరిన రోడ్డు కష్టాలు..

మద్వానిగూడెం - కోరుకొల్లు ప్రధాన రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. గతంలో ఈ రోడ్డంతా గుంతలు పడి అధ్వానంగా ఉండటంతో ద్విచక్ర వాహన చోదకులు పలువురు గుంతల్లో పడి క్షతగాత్రులయ్యారు. వాహనాలు గోతుల్లో దిగబడి ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు అవస్థలు పడేవారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చొరవతో రూ.కోటి 20 లక్షలతో ఈ రహదారికి మరమ్మతులు చేపట్టి పూర్తి చేశారు. దీంతో ఆర్టీసీ బస్సులు యథావిధిగా రాకపోకలు సాగిస్తు న్నాయి. గుంతల రోడ్డు నుంచి మోక్షం కలగడంతో వాహనదారులు ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- కలిదిండి

మైనింగ్‌కు.. మహర్దశ!



చింతలపూడి ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలు (ఫైల్)

» మంత్రివర్గ నిర్ణయాలతో క్వారీ రంగానికి ఊతం

» గ్రావెల్‌కు ఐదేళ్లు, క్వారీ, ఖనిజాలకు పదేళ్ల గడువుతో లీజులు

» ఆదాయం పెంచేందుకు అధికారులు కార్యాచరణ

(ఏలూరు- ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో కుదేలైన మైనింగ్ రంగాన్ని తిరిగి గాడిన పెట్టే చర్యలకు తెలుగుదేశం ప్రభుత్వం పూనుకోవడంతో జిల్లాలో మైనింగ్‌కు మహర్దశ పట్టనుంది. జిల్లాలో ద్వారకాతిరుమలలో బాల్ క్లే, కొయ్యలగూడెం, చింతలపూడి, చాట్రాయి మండలాల్లో రోడ్డు మెటల్, భీమడోలు, ఉంగుటూరు, టి.నర్సాపురం, చాట్రాయి, ముసునూరుల్లో గ్రావెల్ క్వారీలు ఉన్నాయి. ఓవరాల్‌గా 18 క్వారీలున్నట్లు అధికారులు చెబుతున్నారు. గతంలోని లీజు గడువు పెంపు, పాత దరఖాస్తులకు మోక్షం కలిగించడం.. భారం లేకుండా లీజుల పునరుద్ధరణ, కన్సిడరేషన్ భారం తొలగించడం వంటి మార్పులకు మంగళవారం మంత్రి వర్గం భేటీలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

వైసీపీ హయాంలో దరఖాస్తులు పెండింగ్

2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముందు దరఖాస్తు చేసుకున్న వారికి ముందస్తు ప్రాతిపదికన గనులు లీజుకు ఇచ్చేవారు. దరఖాస్తు ఫీజు నామమాత్రంగానే ఉండేది. వైసీపీ ప్రభుత్వంలో 2022లో ఈ-వేలం విధానం అమల్లోకి తీసుకురావడంతో దాదాపుగా చాలా దరఖాస్తులు పెండింగ్‌లో పడిపోయాయి. పాత వాటి బూజులు దులిపి వాటిని కార్యాచరణలో పెట్టనున్నారు. అక్రమార్కులు, వైసీపీ నేతలు అనుచరులే గనులను కొల్లగొట్టారు. వీటికి చెక్ పెట్టేందుకు జిల్లా అధికారులకు జీవోలు రూపంలో ఉత్తర్వులు రానున్నాయి.

గతంలో అంతా దోపిడీయే

గత తెలుగుదేశం ప్రభుత్వంలో రోడ్డు మెటల్ పదేళ్లకు, గ్రావెల్ ఖనిజాలను ఐదేళ్లకు లీజులకు ఇచ్చే వారు. అనంతరం పునరుద్ధరణ జరిగేది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీజులు భారీగా పెంచారు. వార్షిక డెడ్‌రెంట్ విలువకు పదిరెట్లు చెల్లించాల్సి వచ్చింది. దీంతో చాలామంది అనుమతి తీసు కోకుండా ఇష్టానుసారంగా దోపిడీ చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని జేబుల్లో వేసుకున్నారు. ప్రస్తుత నిర్ణయంతో గ్రావెల్‌కు ఐదేళ్లు, ఇతర ఖనిజాలకు పదేళ్లకు రెన్యువల్ చేస్తారు. సీనరేజ్ ధరకు సమానంగా కొవిడ్ కాలంలో వసూలు చేసి కన్సిడరేషన్ మొత్తం నుంచి విముక్తి కలిగించారు. దీంతో జిల్లాలోని లీజుదారులకు ప్రయోజనం చేకూరనుంది. కొత్తవారు ఈ రంగంలోకి అడుగుపెట్టేందుకు మార్గం సుగమం కానుంది. క్వారీలు మూతపడి పనిలేక కార్మికులు పస్తులుండేవారు. భారాలు భరించలేక యజమానులు లబోదిబోమన్నారు.

తాజాగా గట్టెక్కించే దిశగా..

ఏపీ సూక్ష్మ ఖనిజాల విధానం-2025ను మంత్రివర్గం ఆమోదించించడంతో కొన్నేళ్లుగా ఇబ్బందుల్లో ఉన్న పరిశ్రమలను గట్టెక్కించే దిశగా సానుకూల నిర్ణయాలతో గనుల ఆధారిత కుటుంబాలకు మంచి రోజులు రానున్నాయి. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి ఉత్తర్వులు రావాల్సి ఉందని జిల్లా అధికారులు చెబుతున్నారు. ఉత్తర్వులు వచ్చాకా ఆ మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. మరోవైపు తాము కూడా ఆదాయం పెంచడానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్టు పేర్కొంటున్నారు.

33 నెలలుగా జీతాల్లేవ్!

ఎర్రకాలువ జలాశయం (ఎన్ఎంఆర్) ఉద్యోగుల ఆవేదన

ముప్పైమూడువేల ఎకరాల ఆయకట్టు, నాలుగు వేల నాలుగు వందల టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టు, 53 కిలోమీటర్ల కుడి, ఎడమ ప్రధాన కాల్వలు, మూడు మండలాల పరిధిలోని పది వేల ఎకరాల ఆయకట్టు ఉన్న 290 ఎకరాల మైనర్ ఇరిగేషన్ చెరువులు.. వీటన్నింటినీ మెయింటైన్ చేయడానికి ఎంత మంది సిబ్బంది ఉన్నారో తెలుసా.. కేవలం ఆరుగురు నామినల్ మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్) సిబ్బంది మాత్రమే అంటే నమ్ముతారా.. ఇంత పెద్ద ప్రాజెక్టులో రేయింబవళ్లు కష్టపడుతున్న ఆ ఆరుగురికి కనీసం ప్రతీ నెలా ఇచ్చే జీతం వస్తుందా.. అంటే అదీ లేదు. 33 నెలలుగా జీతాలు లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. కుటుంబాలను పోషించేందుకు అప్పుల పాలై రోడ్డున పడుతున్నారు.



ఎర్రకాలువ జలాశయం గేట్లకు మరమ్మతులు చేస్తున్న ఎన్ఎంఆర్ ఉద్యోగులు (ఫైల్)

» రూ.45 లక్షల జీతం బకాయిలు

» వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధులు నిలిపివేత

» మరోవైపు వేధిస్తున్న సిబ్బంది కొరత

» ఉండాల్సింది 25 మంది.. ఉన్నది ఆరుగురే

» సమస్యలను పట్టించుకునే నాథుడే కరువు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెంలో శ్రీ కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం పరిధిలో పని చేయడానికి 2015లో అప్పటి ప్రభుత్వం వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.సత్యనారాయణను రూ.18 వేల జీతానికి, హెడ్ మజ్దూర్‌లుగా ఎస్.వీరేంద్ర, టి.అశోక్, డి.గాంధీలను రూ.16 వేల జీతానికి, వాచ్‌మెన్‌లుగా ఎస్.శేఖర్ బాబు,పి.లక్ష్మణ్‌లను రూ.15 వేల జీతానికి ఎన్ఎంఆర్‌లుగా విధుల్లోకి తీసుకుంది. గత పదేళ్లుగా వీరు అదే జీతానికి తమ ఉద్యోగ బాధ్య తలు నిర్వహిస్తున్నారు. ఎర్రకాలువ ప్రాజెక్టు హెడ్ ఆఫ్ అకౌంట్ ద్వారా ఏటా ప్రాజెక్టు నిర్వహ ణకు రూ.15 లక్షల వరకు నిధులు వచ్చేవి. ఆ నిధులతో ప్రాజెక్టు నిర్వహణ చేస్తూనే ఎన్ఎంఆర్ సిబ్బంది ఆరు గురికి జీతాలు సక్రమంగానే ఇచ్చేవారు. 2022 ఆగస్టు నుంచి అప్పటి వైసీపీ ప్రభు త్వం నిధులను నిలిపి వేసింది. దీంతో దాదాపు 33 నెలల నుంచి ప్రాజెక్టు నిర్వహణకు నిధులూ లేవు, సిబ్బందికీ జీతాలు లేవు.

ఆరుగురిపైనే భారం..

ఎర్రకాలువ ప్రాజెక్టు పరిధిలో 25 మంది సిబ్బంది పలు బాధ్యతలు నిర్వహించాల్సి ఉండగా వారందరి బాధ్యతలు ఈ ఆరుగురే నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఒక డీఈ, ఒక ఏఈ ఉండాల్సి ఉండగా ఇటీవల ఇక్కడ పనిచేసిన డీఈ రాంబాబు పదోన్నతిపై వెళ్లారు. ప్రస్తుతం ఏఈ మాత్రమే ఇక్కడ ఉన్నారు. కొయ్యలగూడెం డీఈ రవీంద్ర ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్నారు.

ఈ ఇద్దరి ఇంజనీర్ల పరిధిలో డ్యామ్ సైట్ 25 మంది రెగ్యులర్ సిబ్బంది ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. ఎన్ఎంఆర్‌లుగా చేరిన ఆరుగురే అన్ని పనులు చేస్తూ ప్రాజెక్టును ఎప్పటికప్పుడు కాపాడుతున్నారు. ప్రాజెక్టు పనితో పాటు ఎస్టి మేట్లు తయారు చేయడం వంటి కార్యాలయ పనులను వీరే చేస్తున్నారు. వరదల సమయంలో రాత్రింబవళ్ళు ప్రాణాలకు తెగించి ప్రాజెక్టు వద్ద పని చేస్తా మని, ఎన్నోసార్లు విష సర్పాల బారి నుంచి తృటిలో తప్పించుకున్నామని వారు పేర్కొంటు న్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి జీతం బకాయిలు ఇప్పించాలని, ప్రతీ నెల జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుటుంబ పోషణకు అప్పులు ..



గత 33 నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. పిల్లల్ని చదివించుకోవడానికి, కుటుంబాన్ని పోషించుకోవడానికి అప్పులు చేస్తున్నాం. వడ్డీలు చెల్లించకపోవడం వల్ల అప్పులు ఇచ్చిన వారు కార్యాలయానికి వచ్చి గొడవ చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజా దర్బార్‌లో మంత్రి లోకేశ్‌ను, పోలవరం ప్రాజెక్టు వద్ద ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి పత్రాలు ఇచ్చాం. దాదాపు రూ.45 లక్షల వరకు మా జీతాలు రావాల్సి ఉంది..

- మల్లాది సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్



అటవీభూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్ తదితరులు

రమణక్కపేటలో జాయింట్ సర్వేకు చర్యలు

ముసునూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేటలోని రెవెన్యూ, ఫారెస్ట్ భూముల విస్తీర్ణం తేల్చేందుకు త్వరలో జాయింట్ సర్వే చేపట్టనున్నట్టు తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ తెలిపారు. నూజివీడు అటవీశాఖ డిప్యూటీ రేంజర్ అరుణ కుమారితో కలిసి ఆయన గురువారం అటవీ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ భూములకు సంబంధించిన రికార్డులు, మ్యాప్‌ను పరిశీలించి, ప్రస్తుతం ఉన్న సరిహద్దు రాళ్లను చూశారు. కొంతకాలంగా ఈ అటవీభూములను జాయింట్ సర్వే చేసి, రెవెన్యూ, ఫారెస్ట్ భూములను విడగొట్టాలని పేద సాగుదారులు, లిబరేషన్ నాయకులు సంయుక్తంగా ఆందోళనలు చేయడంతోపాటు జిల్లా ఉన్నతాధికారులకు అర్జీలు ఇస్తూనే ఉన్నారు. అయినప్పటికి అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఎట్టకేలకు రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాలతో అధికారులు ఈ భూములను పరిశీలించారు. త్వరలోనే ఇరుశాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రవికాంత్, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.



కుర్చీలు ఖాళీ..!

» ప్రభుత్వ శాఖలను వేధిస్తున్న ఉద్యోగుల కొరత

» రెవెన్యూ, సర్వే, పరిశ్రమ, సంక్షేమ శాఖల్లో అధికం.. ప్రజలకు సేవల్లో జాప్యం

» ఉన్న సిబ్బందిపై పనిభారం

(ఏలూరు- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కీలకమైన ప్రభుత్వశాఖల్లో సిబ్బంది ఖాళీల కొరత వేధిస్తోంది. జిల్లాల విభజనతో సగం సిబ్బందిపైనే పొరుగు జిల్లాకు వెళ్లిపోవడంతో, ఆ పోస్టులు భర్తీ కాకపోవడం, ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో ఖాళీలు సంఖ్య పెరిగిపోతోంది. జిల్లా పరిపాలన విభాగానికి గుండెకాయ లాంటి రెవెన్యూశాఖల్లో తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్‌లోని పలు విభాగాల్లో ఖాళీలతో అధికారులకు పని ఒత్తిడి తప్పడం లేదు. సీనియర్ స్థాయిల్లో అధికారులు వివిధ సెక్షన్ల బాధ్యతలు చూడడం వల్ల సకాలంలో రాష్ట్ర అధికార యంత్రాంగానికి నివేదికలు, ఇతర సమాచారం, గణాంకాలు పంపగలుగుతున్నారు. కీలకమైన 10 మండలాల్లో తహసీల్దార్‌ల పోస్టులు ఖాళీగా ఉండగా, ఐదుచోట్ల డిప్యూటీ తహసీల్దార్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పలుచోట్ల సీనియర్, అసిస్టెంట్ల పోస్టులు 25 వరకు ఖాళీగా ఉన్నాయి. జిల్లా పరిశ్రమల కేంద్రంలో అసిస్టెంట్ డైరెక్టర్, జీఎం పోస్టులతో పాటు ఇండస్ట్రియల్ ప్రమోషనల్ అధికారుల కొరత తీవ్రంగా ఉంది. ఐదు ఇండస్ట్రియల్ ప్రమోషనల్ అధికారుల పోస్టులకు గాను ఇద్దరే ఉండడంతో 27 మండలాల్లో వారిద్దరే క్షేత్రస్థాయిలో యూనిట్ల స్థాపనకు, జిల్లా మీటింగ్‌లు వెళ్లాల్సి వస్తోంది. జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు కార్యాలయం పరిధిలో మండల స్థాయి సర్వేయర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. 27 మండల సర్వేయర్లు ఉండాల్సి ఉండగా, కేవలం 15 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 12 మండలాలు ఖాళీగా ఉన్నాయి. ఇదే కార్యాలయం జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంటు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సంక్షేమ శాఖల్లోనూ తీవ్ర కొరత

ప్రధానంగా వివిధ వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందజేసే సంక్షేమశాఖల్లోనూ సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. తెలుగుదేశం ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఈ సారి పెద్దఎత్తున లబ్ధి చేకూర్చనున్నారు. కిందస్థాయి సిబ్బంది లేకపోతే జిల్లా స్థాయి అధికారులకు నివేదికలు తయారు చేయించడం కష్టతరమే. ఇటీవల సీఎం నూజివీడు పర్యటనలోనూ సిబ్బందికి పరుగులు పెట్టాల్సి వచ్చింది. నివేదికలు, బ్యానర్లు, ఇతర ఏర్పాట్లలో ఇబ్బందులు తప్పలేదు. ప్రధానంగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కార్యాలయంలో ఏఈవో -2, ఈవో-1, సీనియర్ అసిస్టెంట్-4 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేవలం ఈడీతో పాటు రెగ్యులర్ పోస్టు (సీనియర్ అసిస్టెంట్), వాచ్‌మెన్ ఒకరు పనిచేస్తున్నారు.. ఆప్కాస్ నుంచి ఒక్కరు, ఎన్ఎంఆర్‌లు కింద ఇద్దరు పనిచేస్తున్నారు. డైరక్టరేట్ సోషల్ వెల్ఫేర్ కార్యాలయం నుంచి ఒక్క పోస్టు కింద డీసీఎంయూను ఇటీవల నియమించారు. ఈయన షాపుల అద్దెలు వసూళ్లకు ఉపయోగిస్తున్నారు. రెగ్యులర్‌గా విధులకు ఆటంకం తప్పడం లేదు. బీసీ సంక్షేమాధికారి కార్యాలయంలోనూ బీసీ కార్పొరేషన్‌లో ఇద్దరు జూనియర్ అసిస్టెంట్, ఒక సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో ఒక సూపరిటెండెంట్, ఒక జూనియర్ అసిస్టెంట్ మాత్రమే విధుల్లో ఉన్నారు. ఒక అటెండరును డిప్యూటేషన్ రప్పించుకున్నారు. ఇద్దరు సీనియర్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, టైపిస్ట్ పోస్టుల్లేకపోవడంతో ఉన్నవారితో విధులను అష్టకష్టాలు పడుతూ చేయించుకుంటున్నారు. రోజూవారీ విధులకు చాలా ఇబ్బందులు పడుతున్నట్టు జిల్లాస్థాయి అధికారులు మొరపెట్టుకున్నారు. ఈ శాఖల డైరక్టరేట్‌ల నుంచైనా నైపుణ్యం కలిగిన సిబ్బందిని పంపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


చింతలవల్లిలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి

ముసునూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు సమపాళ్లలో క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. చింతలవల్లి, వేల్పుచర్ల గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడలో భాగంగా పౌష్టకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణీ నిర్థారణ అయిన నాటి నుంచి 9వ నెల వరకు బరువు 10 నుంచి 12 కేజీలు పెరగాలన్నారు. అనంతరం రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

తాగునీటిని చేపల చెరువులకు మళ్లిస్తే కఠిన చర్యలు

కలిదిండి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):తాగునీటి చెరువులకు నీటి వంతు వెళ్తుండగా, చేపల చెరువులకు మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామకృష్ణ హెచ్చరించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి వంతుపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతుమర్రు కాల్వకు ఈ నెల 18 నుంచి నాలుగు రోజులపాటు నీటి వంతు ఇస్తారని తాగునీటి చెరువులను నింపుకోవాలన్నారు. లంక గ్రామాలకు ఈ నెల 23 నుంచి నీటి వంతు విడుదల చేస్తారన్నారు. తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నిండే వరకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కాల్వల్లో ఇంజన్లు వేసి చేపల చెరువులకు మళ్లిస్తే కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. కలిదిండి, కోరుకొల్లు డీసీ ఛైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ, ఎంపీడీవో కొండలరావు, ఆర్ డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈఈ ఫణి కుమార్, ఎస్ఐ వెంకటేశ్వరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పీఎంజేజేబీవై చెక్కు అందజేత


మృతురాలి భర్త రమేష్‌కు చెక్కును ఇస్తున్న మేనేజర్ రాంబాబు

ముసునూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రేనిపాడుకు చెందిన నంబూరి సుబ్బలక్ష్మి ఇటీవల మృతి చెందారు. అయితే ఆమె గోపవరం స్టేట్ బ్యాంక్‌లో ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం కింద రూ.436 ప్రీమియం కట్టారు. దీని నిమిత్తం పీఎంజేజేబీవై కింద వచ్చిన రూ.2,00,000 చెక్కును నామినిగా ఉన్న మృతురాలి భర్త రమేష్‌కు బ్యాంక్ మేనేజర్ కె.రాంబాబు గురువారం అందజేశారు.

అగ్ని ప్రమాదాల్లో ఆత్మరక్షణపై అవగాహన

నూజివీడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):అగ్నిప్రమాదాల సమయంలో విషవాయువు నుంచి రక్షణ కోసం కిందకు వంగి నడుస్తూ ఆత్మరక్షణ పొందాలని నూజివీడు అగ్నిమాపక శాఖ అధికారి డి.ముత్తయ్య తెలిపారు. నూజివీడు మండలం గొల్లపల్లి అన్నె రామకృష్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు దట్టమైన పొగ పైభాగంలో ఉంటుందని దాని నుంచి తప్పించుకునేందుకు వంగి నడవడం ద్వారా విషవాయువు నుంచి కొంతమేర రక్షణ పొందవచ్చన్నారు.

నీటి వనరుల గణనపై శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్‌వో ప్రతిమ

కలిదిండి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):నీటి వనరుల గణనపై గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌వో ప్రతిమ మాట్లాడుతూ త్వరలో ప్రారంభం కానున్న చిన్న తరహా నీటి వనరుల జలాశయాలు గణన చాలా కీలకమన్నారు. చెరువులు ట్యాంకులు, సరస్సులు, జలాశయాలు వంటి నీటి వనరుల సమగ్ర జాబితాను అందిస్తుందన్నారు. నీటి వినియోగం కేటాయింపు పునరుద్ధరణకు సంబంధించిన సమాచారంతో కూడిన నిర్ణయం తీసుకోవటంలో సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ

ముదినేపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025 -26 విద్యాసంవత్సరంలో గ్రూపుల సంఖ్య పెరుగనుంది. ప్రస్తుతం కళాశాలలో ఎంపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులుండగా, ఈ ఏడాది నుంచి కొత్తగా బైపీసీ, ఎంబైపీసీ గ్రూపులను కూడా ప్రవేశపెట్టనున్నారు. కొత్త గ్రూపుల్లో ఒక్కొక్క గ్రూపునకు 44 మంది విద్యార్థులను చేర్చుకునేందుకు అనుమతి ఉన్నది. కళాశాల ప్రిన్సిపాల్ ఓరుగంటి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో అధ్యాపకులు హైస్కూళ్లకు వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. బైపీసీ, ఎంబైపీసీ గ్రూపులు ప్రవేశపెడితే కళాశాలలో ల్యాబ్ సౌకర్యం ఏర్పాటు చేసేందుకు, బోటనీ, జువాలజీ లెక్చరర్లను నియమించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు సిద్ధంగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.



అడ్మిషన్లపై కళాశాల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



21న ఆగిరిపల్లి మండల సమావేశం

ఆగిరిపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 21వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ గొల్ల అనూష అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ఆనంద్ బాబు తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికా రులు హాజరుకావాలని ఎంపీడీ వో కోరారు.

ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆగిరిపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీలకు సంబంధించి స్వయం ఉపాధి పథకాలకు మే 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంపీడీవో ఆనంద్ బాబు తెలిపారు. ఎస్సీ కార్పొ రేషన్ ద్వారా వివిధ పథకాలకు సబ్సిడీ మంజూరు చేయుటకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.



మోటార్ సైకిల్ ఢీకొని..

ముదినేపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం చినపాలపర్రు గ్రామం వద్ద బుధవారం సాయంత్రం సైక్లిస్టును బైక్ ఢీకొన్న సంఘటనలో ఆ గ్రామానికి చెందిన దుక్కిపాటి శ్రీనివాసరావు (85) అనే వృద్ధుడు మృతి చెందాడు. ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొన్న ఈ సంఘటనలో తలకు బలమైన గాయాలకు గురైన శ్రీనివాసరావును వెంటనే గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మరణించారు. దీనిపై మృతుడి కుమార్తె కృష్ణ కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముదినేపల్లి ఎస్ఐ వీర భద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





సొసైటీల్లో రెండంచెల విధానం ప్రవేశపెట్టాలి

అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి.హరనాథ్



చాట్రాయి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకుల్లో ప్రస్తుతం అమలులో ఉన్న మూడు అంచల విధానాన్ని రద్దు చేసి, రెండు అంచెల విధానం ప్రవేశపెట్టాలని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి.హరనాథ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ నాబార్డు నుంచి రాష్ట్ర సహకార బ్యాంకుకు, దీని నుంచి జిల్లా కేంద్ర సహకార బ్యాంకులకు, వీటి నుంచి ప్రాథమిక సహకార సంఘాలకు నిధులు విడుదల జరిగి తరువాత రైతాంగానికి రుణాలు అందజేస్తున్నారని అన్నారు. ఈ మూడు అంచెల మధ్య సమన్వయ లోపాల వలన, పాలనలో అవినీతి చోటుచేసుకొని అన్నదాతలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. కేరళ రాష్ట్రం ఇప్పటికే రెండు అంచెల విధానం అమలులోకి తెచ్చిందని అన్నారు. పలు రాష్ట్రాలు రెండు అంచెల విధానం అమలు దిశలో ఉన్నతస్థాయి కమిటీలు ఏర్పాటు చేశాయని, రెండు అంచెల విధానం అమలు జరపాలనుకునే రాష్ట్రాలకు ఆర్బీఐ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసిందని, కూటమి ప్రభుత్వం దీనిపై మంత్రివర్గంలో చర్చించి రెండు అంచెల విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని హరనాథ్ విజ్ఞప్తి చేశారు

వీఆర్వో మధుసూధనరావు మృతి



కైకలూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో వీఆర్వో గుడికందుల మధుసూధనరావు(55) బుధవారం రాత్రి మృతి చెందారు. అనారోగ్యానికి గురికావడంతో ఏలూరులోని ప్రభుత్వాసుపత్రిలో రెండు రోజులుగా చికిత్స పొందుతున్నారు. ఆయన ప్రస్తుతం కైకలూరు మండలం గోపవరం, రాచపట్నం గ్రామాలకు వీఆర్వోగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. తహసీల్దార్ కార్యలయ సిబ్బంది, ఆర్ఐ బి.వెంకటేశ్వరరావు, వీఆర్వోలు, వీఆర్ఏలు గురువారం మధుసూధనరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వర్గీకరణపై ఎస్సీ సెల్ నాయకుల హర్షం

కైకలూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అందరికి ఆమోదయోగ్యమైనదని నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తేరా రమేష్ బాబు అన్నారు. కైకలూరులో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను ఉమ్మడి జిల్లాల ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయడం హర్షణీయమని అన్నారు. రానున్న డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టులకు ఈ ఎస్సీ వర్గీకరణను అమలుచేయడం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి అని కొనియాడారు. కూటమి ప్రభుత్వంలో దళితులకు న్యాయం జరుగుతుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మండల ఎస్సీసెల్ అధ్యక్షులు వాసిపల్లి సతీష్‌కన్నా, కారే రాజు, ఉపాధ్యక్షుడు ముత్యాల జీవన్, మాజీ సర్పంచ్ గుజ్జల రామలక్ష్మీ పాల్గొన్నారు.

కొల్లేరు సమస్య పరిష్కారానికి వెసులుబాటు

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ప్రాంత ప్రజల వాదన లు వినిపించేందుకు సుప్రీంకోర్టు మూడు నెలలు వెసులుబాటు కల్పించడం శుభపరిణామం అని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ పేర్కొన్నారు. కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి ఇది మొదటి అడుగన్నారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వాలు చేసిన కృషి ఫలించిందన్నారు. కొల్లేరు సరిహద్దులు నిర్ణయించాలని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అధికారులు చేప ట్టిన చర్యలకు ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారన్నారు. దీంతో ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు సీఎం కలిసి పరిస్థితి వివరించారని దాని ఫలితంగానే సుప్రీంకోర్టు గడువునిచ్చిందన్నారు.



బొండాడలో ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో ఇళ్ల తొలగింపు పనులు

ఇళ్ల తొలగింపులో ఉద్రిక్తత

కాళ్ళ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బొండాడ గ్రామంలో ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో 28 ఇళ్ల తొలగింపు గురువారం చేపట్టారు. అడ్డుకున్న సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ అరెస్టుకు పోలీసులు ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఆకివీడు సీఐ జగదీశ్వరరావు, కాళ్ళ, ఆకివీడు, భీమవరం రూరల్ ఎస్ఐలు, పోలీసులు చుట్టుముట్టారు. సుమారు 3 గంటల హైడ్రామా తర్వాత రామకృష్ణను అదుపులోకి తీసుకుని దగ్గరుండి కూల్చివేత ప్రారంభించారు. బాధితులు మాట్లాడుతూ ప్రత్యామ్నాయం చూపకుండా జేసీబీలతో కూల్చడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలతో పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

మా జిల్లాకు నిధులు ఇవ్వండి

- జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే బొలిశెట్టి డిమాండ్
- వైసీపీ హయాంలో కేటాయింపులు నిల్
- మండలానికి కోటి ఇచ్చారన్న వైసీపీ సభ్యులు
- తమకు రాలేదన్న టీడీపీ సభ్యులు.. వాడీ వేడి చర్చ
- తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు : జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ
- ప్రణాళికాబద్ధంగా పంటల సాగు జరగాలి : ఎమ్మెల్యే ఆరిమిల్లి
- ఏజెన్సీలో తాగునీటి సమస్య పరిష్కరించాలి : ఎమ్మెల్యే బాలరాజు



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

ఏలూరు సిటీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. గురువారం మధ్యాహ్నం ఏలూరు జడ్పీ హాల్‌లో చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన ప్రారంభమైంది. సమావేశంలో విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జడ్పీ నిధుల కేటాయింపులో తమ జిల్లా నిర్లక్ష్యానికి గురైందని, ఇప్పటికైనా ఎక్కువ శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇది చర్చకు దారి తీసింది. గత ప్రభుత్వ హయాంలో పాలకొల్లు, యలమంచిలి మండలాలకు ఎక్కువ శాతం నిధులు కేటాయించారని పలువురు జడ్పీటీసీ సభ్యులు పేర్కొన్నారు. వైసీపీ జడ్పీటీసీ పి.విజయబాబు మాట్లాడుతూ గతంలో మండలానికి కోటి రూపాయల నిధులు జడ్పీ నుంచి కేటాయించారని అనడంతో వీరవాసరం జడ్పీటీసీ సభ్యుడు జి.ప్రకాశ్‌నాయుడు తమ మండలానికి ఒక్క రూపాయి కూడా రాలేదని, కోటి ఎక్కడ ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆచంట జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు కూడా తమ మండలానికి కోటి ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఈసారి తమ నియోజకవర్గానికి జడ్పీ నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి కోరడంతో కేటాయిస్తామని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ హామీ ఇచ్చారు.అనంతరం వివిధ శాఖల నివేదికలను ఆయా విభాగాల అధికా రులు సభకు వివరించారు. దీనిపై సభ్యులు చర్చించారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు : జడ్పీ చైర్‌పర్సన్

ఎమ్మెల్యేలు బొలిశెట్టి, చిర్రి బాలరాజు, పలువురు జడ్పీటీసీలు తమ ప్రాంతాల్లోని కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్క రించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ స్పందిస్తూ 'జిల్లాలో కృష్ణా, గోదావరి కాలువలు కట్టేసే తేదీని ఈ నెల 22 వరకు పొడిగించినందున, ఈలోగా తాగునీటి వనరులను పూర్తిస్థాయిలో నింపుకోవాలి. శివారు ప్రాంతాలకు నీరందేలా చర్యలు తీసుకోవాలి. వేసవిలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్య తలెత్తకూడదు. అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా బోర్లు వేయాలి. మరమ్మతు లకు గురైన బోర్లను వెంటనే పునరు ద్ధరించాలి' అని అధికారులకు సూచించారు. ప్రభుత్వ కార్య క్రమాల్లో జడ్పీటీసీలు, ఎంపీపీలకు అధికారులు ప్రోటోకాల్ సరిగా పాటించడం లేదని పలువురు సభ్యులు చెప్పడంతో చైర్‌పర్సన్ స్పందించారు. ప్రోటోకాల్ ఉల్లంఘిస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేయాలి : ఆరిమిల్లి

'జూలైలో కురిసిన అధిక వర్షాల వల్ల పంటలు కోల్పోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇంకా చెల్లించలేదు. వెంటనే జమయ్యేలా చూడాలి. అధిక దిగుబడిని అందించే టీఆర్ 126 ధాన్యం రకం సాగుపై రైతులకు అవగాహన కలిగించాలి. ఆ ధాన్యాన్ని అరబెట్టే డ్రయ్యర్లు కలిగిన మిల్లులకు నేరుగా అందించేలా చర్యలు తీసుకోవాలి. ఈ వ్యవసాయ సీజన్‌లో పది లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. తగిన విధంగా ధాన్యం సేకరణ లక్ష్యాలను నిర్ణయించాలి. సంక్రాంతి ముందుగా రబీ, జూలై నెలాఖరులోపు ఖరీఫ్ పంటలు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా వెళ్లాలి. దీనివల్ల రైతులు ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోకుండా ఉంటారు' అని తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ సూచించారు.

నిధులు సమానంగా కేటాయించాలి : ఎమ్మెల్యే బొలిశెట్టి

మూడు జిల్లాల పరిధిలో వున్న జిల్లా పరిషత్ నిధులు అన్ని నియోజకవర్గాలకు సమానంగా కేటాయించాలి.గతంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రతి నియోజకవర్గానికి రూ.25 కోట్లు కేటాయిస్తే.. తాడేపలిగూడెంకు రూ.7 కోట్లు మాత్రమే ఇచ్చారు. భవిష్యత్‌లో వ్యత్యాసాలు లేకుండా సమానంగా కేటా యించాలి. తాడేపల్లిగూడెంలో తాగునీటి సమస్య, సాగునీటి కాలువలు, చెరువులు, డ్రెయిన్లలో తూడు తొలగింపు పనులు చేపట్టాలి' అని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు.

తాగునీటి సమస్య తీర్చాలి : బాలరాజు

'గత ప్రభుత్వ హయాంలో పోలవరం ఏజెన్సీ ఏడు మండలాల్లో వున్న 121 గ్రామాలకు నిధులు కేటాయించకపోవడం వల్ల అన్ని గ్రామాలు వెనుకబడ్డాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధి వేగవంతంగా జరిగి ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఆనందంతో ఉన్నారు. రక్షిత మంచినీటి పథకాల పనులు పూర్తి చేసి గిరిజన ప్రాంతాల్లో తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలి' అని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కోరారు.

గౌరవ వేతనాలు ఇవ్వాలి : ఎమ్మెల్సీ వంక

'జడ్పీటీసీలు, ఎంపిటీసీలకు 18 నెలలుగా రావాల్సిన గౌరవ వేతనం బకాయిలు అందించేందుకు చర్యలు తీసుకోవాలి. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా మంజూరైన యూనిట్లకు లబ్ధిదారులతో వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. తణుకు సమీపంలో పశువుల మాంసం కేంద్రం కారణంగా పర్యావరణానికి విఘాతం కలుగు తోందని, ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలి' అని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ కోరారు. సమావేశంలో ఏలూరు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జడ్పీ సీఈవో కె.భీమేశ్వర్, పశ్చిమ, తూర్పుగోదావరి జేసీలు టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎస్.చిన్నరాముడు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పేర్కొన్నారు. గురువారం జడ్పీ సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకు స్థాయీ సంఘ సమావేశాల్లో పలు అంశాలపై సమీక్షించారు. అధికారులు మండలాల వారీగా మంజూరైన, ప్రగతిలో వున్న పనుల వివరాలను వివరించారు. పద్మశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు దశల వారీగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారన్నారు. జిల్లాలో మంజూరైన కొన్ని పనులు పూర్తి చేయని కారణంగా పెండింగ్‌లో ఉన్నా యని, వాటిని నిర్దేశించిన సమయంలో పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. జడ్పీ సమావేశాలకు తూర్పు గోదావరి జిల్లా నుంచి అధికారులు హాజరు కాకపోవడంతో వారిపై చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో భీమేశ్వర్‌ను చైర్‌పర్సన్ ఆదేశించారు.

ఎంపెడా కార్యాలయ భవనం సిద్ధం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు, మార్కెటింగ్‌లో అత్యంత కీలకమైన ఎంపెడా కార్యాలయం సిద్ధమైంది. దశాబ్దాల అనంతరం సొంత భవనంలోకి వెళుతోంది. భీమవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో భవనం నిర్మించారు. కేంద్ర వాణిజ్య, పారిశ్రామిక శాఖ రూ.23 కోట్లు నిధులు కేటాయించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అంజిబాబు, ఏఎంసీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు ఎంపెడా సొంత భవనంపై దృష్టి పెట్టారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రానికి పంపించగా నిధులు మంజూరయ్యాయి. భవన నిర్మాణం పూర్తి కావడంతో తెలుగుదేశం ప్రభుత్వమే ప్రారంభించనుంది. కేంద్రమంత్రి పీయూష్ గోయెల్ భవనాన్ని ప్రారంభించేలా కసరత్తు చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు భీమవరంలోని ఎంపెడా కార్యాలయం కార్యస్థానం. రొయ్య, సముద్ర ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించడం, విదేశీ మార్కెట్‌ను పెంపొందించడం, స్థానికంగా రొయ్య ప్రాసెసింగ్ యూనిట్‌లను నెలకొల్పడంలో ఎంపెడా కీలకం. ఎగుమతిదారులకు లైసెన్స్‌లు మంజూరు చేస్తుంది. సముద్ర ఉత్పత్తులను పెంపొందించడం, అత్యధిక ంగా ఉత్పత్తి సాధించడంపై దృష్టి కేంద్రీకరిస్తుంది. ఉభయగోదావరి జిల్లాలతోపాటు, నెల్లూరు జిల్లాలో రొయ్య ఉత్పత్తులు అధికం. మూడు జిల్లాల్లో ఏటా రూ.15వేల కోట్ల రొయ్య ఉత్పత్తులు ఎగుమతి అవుతాయి. ప్రధానంగా అమెరికాకు పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తుంటారు. అక్కడ మార్కెట్‌ను సులభతరం చేయడంలో ఎంపెడా కీలకంగా ఉంటుంది. దక్షిణాదిలో కొచ్చిన్‌తోపాటు, భీమవరం ఎంపెడా కార్యాలయాలు రొయ్య, ఇతర సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో ప్రధాన భూమిక పోషిస్తున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

వారసత్వంగా వచ్చే హిమోఫిలియా

కైకలూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): హిమోఫిలియా అనేది వారసత్వంగా వచ్చే జన్యుపరమైన రుగ్మత అని ఇది రక్తప్రసరణకు చెందిన వ్యాధి అని దీని పట్ల అప్రమత్తంగా ఉండాలని కైకలూరు సీహెచ్‌ఎన్‌సీ వైద్యులు డాక్టర్ ప్రసన్న, జి.కీర్తి అన్నారు. బుధవారం కైకలూరు సామాజిక ఆరోగ్యకేంద్రంలో ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో పాటు సదరన్ క్యాంపు నిర్వహించడంతో నియోజకవర్గంలోని దివ్యాంగులు పెద్దఎత్తున శిబిరానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్లు మాట్లాడుతూ పెద్దల నుంచి పిల్లలకు వారసత్వంగా ఈ వ్యాధి సంక్రమిస్తుందని ఇది పురుషులలో ఎక్కువ శాతం ఉంటుందని తెలిపారు. జన్యులోపంతో రక్తం గడ్డకట్టడానికి, రక్తస్రావాన్ని ఆపి శరీర సామర్థ్యాన్ని బలహీనపరుస్తుందని అన్నారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేడర్ డి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తాళికట్టు శుభవేళ



ఈనెల 30న మంచి ముహూర్తం
రానున్న మూడు నెలల్లో 19 ముహూర్తాలు
జూన్ 10 నుంచి రెండు నెలలు పెళ్లిళ్లకు బ్రేక్

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):విశ్వావసు నామ సంవత్సరం.. చైత్రమాస శుభవేళ.. జిల్లాలో పలు జంటలు మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యే శుభ తరుణం ఆసన్నమైంది. చైత్రం నుంచి జ్యేష్టమాసం వరకూ మూడు నెలల్లో 19 మంచి ముహూర్తాలున్నాయని పండితులు చెబుతున్నారు. ఈ నెల 18, 20, 23, 30వ తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయంటున్నారు. 30వ తేదీ బుధవారం అక్షయ తృతీయ రావడంతో వేల సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి. ఆ రోజు చినవెంకన్న క్షేత్రంలో పలు కల్యాణ మండపాలు బుక్ అయ్యాయని దేవస్థానం, ప్రైవేటు మండపాల యాజమాన్యాలు చెబుతున్నాయి. జూన్ 10 నుంచి జూలై 8 వరకూ గురుమౌఢ్యమి కారణంగా, జూన్ 27 నుంచి ఆషాఢమాసం ప్రారంభం కావడంతో ఆ నెల రోజులు ముహూర్తాలు లేవని పండితులు చెబుతున్నారు. దీంతో ఈ ముహూర్తాలకే వివాహాలు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. మౌఢ్యమి నెల రోజులు, ఆషాడమాసంలో మరో నెలరోజులు బ్రేక్ ఇచ్చిన తర్వాత తిరిగి శ్రావణంలో జూలై 26 నుంచి వివాహాలు ప్రారంభమవుతాయని పురోహితుడు గోవిందవఝుల వెంకటరమణమూర్తి శర్మ చెప్పారు. వైశాఖ మాసంలో మే 1, 7, 8, 9, 11, 17, 18, 28 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయని ఆయన వివరించారు. జ్యేష్టమాసం వచ్చే జూన్ 3, 4, 5, 6, 7, 8 తేదీల్లో పెళ్లిళ్లు జరగనున్నాయి.

ఊపందుకుంటున్న పెళ్లి పనులు

ముహూర్తాలకు తగ్గట్టే పెళ్లిళ్లు వందల సంఖ్యలో జరగనుండటంతో జిల్లాలో చాలా వరకు కల్యాణ మండపాలు బుక్ అయ్యాయి. ద్వారకా తిరుమల శ్రీవారి క్షేత్రంలో గదులు, సత్రాలు, కాటేజీలు, కల్యాణ మండపాలు రిజర్వు చేసుకున్నారు. కేటరింగ్, పచ్చిపూల మండపాలు, అలంకరణ, లైటింగ్, బాజాభజంత్రీలు, ట్రావెల్స్ పురోహితులకు మంచి డిమాండ్ కనిపిస్తుంది. పెళ్లి బృందాలవారు తమ ఏర్పాట్లలో బిజీబిజీగా ఉన్నారు. వివాహ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి పచ్చిపూల మండపాలు. వీటి ధరలు వింటే గుండె గుభేలుమంటోంది. రూ.50 వేల నుంచి రూ.4 లక్షలకుపైగా పలుకుతున్నాయి. ధనికులు తగ్గేదేలే అంటూ పెళ్లిళ్లకు ఏర్పాట్లు చేస్తుంటే పేద, మధ్య తరగతి వారు హడావుడి లేకుండా బంధు మిత్రుల సమక్షంలో ఆలయ ఆవరణలోనే జరిపిస్తున్నారు.


మంచి ముహూర్తాలున్నాయి

అన్ని నక్షత్రాల వారికి ఈనెల 18, 23, 30న మంచి ముహూర్తాలు ఉన్నాయి. 30న మరింత మంచి ముహూర్తం. ఎందుకంటే అక్షయ తృతీయ కలిసింది. దాదాపు 19 మంచి ముహూర్తాలు రానున్న మూడు నెలల్లో ఉన్నాయి. జూన్ 10 నుంచి మౌఢ్యమి, ఆ తరువాత ఆషాడం కావడంతో దాదాపు రెండు నెలలపాటు పెళ్లిళ్లకు బ్రేక్ పడనుంది.

- గోవిందవఝుల వెంకట రమణమూర్తి శర్మ, ద్వారకాతిరుమల

అలరించిన నాటక ప్రదర్శనలు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) :కళారంజని నాటక అకాడమీ ఆధ్వర్యంలో భీమవరం సోమేశ్వర, జనార్ధనస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న జాతీయస్థాయి తెలుగు నాటిక పోటీల రెండో రోజు గురువారం రాత్రి రెండు నాటికలు ప్రదర్శించారు. గుంటూరుకు చెందిన నటుడు, దర్శకుడు ఎన్.రవీంద్రరెడ్డికి ఎస్వీ రంగారావు స్మారక పురస్కారం అందించారు. ప్రపంచ దేశాలు భారతీయ వివాహ వ్యవస్థను పొగుడుతుంటే మనవాళ్ల భారతీయ సంస్కృతిని పక్కన పెట్టి డేటింగులు, చాటింగులు, క్లబ్బులు-పబ్బులు అంటూ సహజీవనాలు అంటూ భ్రష్టుపట్టిపోతున్న నేటి వ్యవస్థలో కొడుకుని కాపాడుకోవడానికి ఒక తండ్రి పడిన ఆరాటం 'ఒక ఇల్లాలు చేసిన పోరాటం' నాటిక అందరినీ ఆలోచింపజేసింది.



అమ్మకు కష్టం..

- అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వృద్ధురాలు
- చూసే దిక్కులేక ఒంటరిగా ఇంట్లో బందీ



పోలవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):భర్త అకాల మరణంతో ఒంట్లో సత్తువ ఉన్నంత కాలం కూలిపనులు చేసి ఉన్న ఒక్క కూతురిని పెంచి పెళ్లి చేసి పంపింది. వృద్ధాప్యం మీదపడి ఆలనా పాలనా చూసే దిక్కులేక అనారోగ్యం పాలైంది. కాలు చేయి స్వాధీనం కోల్పోయి జీవచ్ఛవంలా తన ఇంట్లో బందీగా మారింది. నెలనెలా వస్తున్న నాలుగు వేల పెన్షన్ మందుల కు, ఆహారానికి చాలక చీకటి గదిలో భారంగా బతుకు వెళ్లదీస్తున్నది. పోలవరం మండలం పట్టిసీమ గ్రామానికి చెందిన చిన్నం లక్ష్మికి ఒకే ఒక కూతురు.. పెళ్ళి చేసి పంపిన తర్వాత భర్త దూరమవడంతో ఉపాధిలేక ముగ్గురు పిల్లలతో పట్టిసీమ నుంచి పోలవరం వెళ్లి అక్కడే కూలిపని చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నది. అనారోగ్యంతో ఉన్న తల్లిని తమతో ఉంచుకుందామంటే ఇంటి యజమానులు అంగీకరించకపోవడం వల్ల తల్లిని చూసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఉదయం సాయంత్రం ఆమె మనవడో మనవరాలో టిఫిన్, బోజనం తీసుకుని వెళ్లి ఇస్తున్నారు. వారే ఆమెకు స్నానం చేయించి శుభ్రం చేసి ఇంట్లో ఉంచి తాళం వేసి వెళతారు. సరైన వైద్య సదుపాయాలు అందిస్తే ఆమె ఆరోగ్య పరిస్థితి కొంతమేర మెరుగవుతుందని ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని కేరళ లేదా మధురై వైద్య సేవల కోసం వెళ్లవలసి ఉంటుందని ఆమెను పరీక్షించిన స్థానిక ప్రభుత్వ వైద్యుడు తెలిపారు. అధికారులు స్పందించి పెన్షన్ పెంచేలా చర్యలు తీసుకోవాలని వృద్ధురాలి కూతురు కోరుతోంది. దాతలు సహకరించి ఆదుకోవాలని వేడుకుంటోంది..



చిన వెంకన్న హుండీ ఆదాయం రూ.1.93 కోట్లు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):ద్వారకా తిరుమల శ్రీవారికి హుండీల లెక్కింపు ద్వారా 20 రోజుల కాలానికి రూ.1.93 కోట్ల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. ప్రమోద కల్యాణ మండపం ఆవరణలో గురువారం భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. హుండీల ద్వారా రూ.1,93,36,657 కోట్ల నగదు, భక్తులు సమర్పించిన 326 గ్రాముల బంగారం, 4.149 కేజీల వెండి లభించింది. రద్దయిన పాత నోట్లు రూ.500 పది, వెయ్యి నోట్లు ఐదు, రెండు వేల నోట్లు ఐదుతోపాటు విదేశీ కరెన్సీ లభించింది.

రిమాండ్ ఖైదీ మరణంపై విచారణాధికారిగా ఆర్డీవో

ఏలూరు క్రైం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గంధం శాంతకుమారి గత మార్చి 30వ తేదీన మరణించిన సంఘటనపై ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్‌ను జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి విచారణ అధికారిగా నియమించారు. ఈ సంఘటనపై విచారణాధికారి, ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ ఈనెల 25వ తేదీన ఉదయం 11 గంటలకు ఏలూరు ఆర్డీవో కార్యాలయంలో విచారణ నిర్వహించడం జరుగుతుందని, ఈ సంఘటనకు సంబంధించి వివరాలు సమాచారం అందించే వ్యక్తులు ఈ నెల 25వ తేదీన ఉదయం 11 గంటలకు ఏలూరు ఆర్డీవో కార్యాలయానికి హాజరై సంఘటనకు సంబంధించి తమ వాంగ్మూలం ఇవ్వవచ్చని ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ ఒక ప్రకటనలో తెలిపారు.

మట్టి నమూనాల సేకరణ

పోలవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):పోలవరం ప్రాజెక్టులో వినియోగించనున్న మట్టి నాణ్యతను కేంద్ర మట్టి రాతి నాణ్యతా పరిశీలన బృందం(సీఎస్ఎంఆర్ఎస్) రెండో రోజు గురువారం పరిశీలించింది. ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన గ్యాప్ 1, గ్యాప్ 2, ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం ప్రాంతాల్లో వినియోగానికి అవసరమయ్యే మట్టి నమూనాలను ప్రాజెక్టు స్పిల్ వే, పవర్ హౌస్, అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా దండంగిలో పంట పొలాల వద్ద బృందం నిపుణులు బి.సిద్దార్ధ్ హెడావో, విపుల్‌కుమార్‌గుప్తా సేకరించారు.







